ప్రజాశక్తి
శుక్రవారం 5 జులై 2024 8 పేజీలు
గుంటూరు పల్నాడు





ఆశ,నిరాశల మధ్య ఖరీఫ్



- పట్టిసీమ నుంచి గోదావరి జలాల విడుదల
- కృష్ణా డెల్టాలో రైతుల్లో ఉత్సాహం
- సాగర్ ఆయకట్టు పరిధిలో కొనసాగుతున్ననీటి కష్టాలు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

గుంటూరు, పల్నాడు జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ సాగు ఆశ, నిరాశల మధ్య ప్రారంభమైంది. గుంటూరు జిల్లాలో డెల్టాలో వరి సాగుకు కొంత మేరకు ఆశాజనకమైన పరిస్థితులు నెలకొన్నాయి. ప్రధానంగా డెల్టాలోని ఎక్కువ మండలాల్లో గత నెలలో అవసరానికి మించి వర్షం కురిసింది. దీంతో సాగుకు అవకాశాలు మెరుగుపడ్డాయి. అయితే నాగార్జున సాగర్, పులిచింతల జలాశయాలలో నీటి నిల్వలు పూర్తిగా అడుగంటి పోవడం వల్ల వరి సాగుకు అవసరమైన మేరకు నీరు వస్తుందా? లేదా? అనే సంశయం రైతుల్లో నెలకొంది.

డెల్టాలో 1.64 లక్షల ఎకరాలలోవరి సాగు చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు కేవలం 3760 ఎకరాల్లోనే బోర్లు ద్వారా సాగు ప్రారంభమైంది. 67 వేల ఎకరాల్లో పత్తి సాగు అవుతుందని అంచనా వేయగా 5 వేల ఎకరాల్లో సాగు చేశారు. ఇతర పంటలు మరో వెయ్యి ఎకరాల్లో సాగు చేశారు. పల్నాడు జిల్లాలో 1.06 లక్షల ఎకరాల్లో వరి సాగు జరుగుతుందని అంచనా వేయగా ఇప్పటి వరకు ఒక్క ఎకరంలో కూడా సాగు ప్రారంభంకాలేదు. జిల్లాలో పత్తి 2.65 వేల ఎకరాల్లో సాగు చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు కేవలం 7వేల ఎకరాల్లోనే సాగు చేశారు. ఇతర పంటలు ▶ 2లో



అడుగంటిన నాగార్జున సాగర్ జలాశయం

503.90 అడుగులకు నీటిమట్టం

ప్రజాశక్తి - విజయపురిసౌత్

నాగార్జున సాగర్ రిజర్వాయర్‌లో నీటి మట్టాలు కనిష్ట స్థాయికి పడిపోయాయి. కృష్ణా ఎగువ ప్రాంతం నుంచి వరద ప్రవాహం లేకపోవడంతో నీటి నిల్వలు గణనీయంగా తగ్గాయి. సాగర్ గరిష్ట నీటిమట్టం 590 అడుగులు కాగా, ప్రస్తుతం 503.90 అడుగులకు చేరుకుంది. మొత్తం నీటి నిల్వ సామర్థ్యం 312 టీఎంసీలు కాగా ప్రస్తుతానికి 121.54 టీఎంసీలుగా ఉంది. డెడ్ స్టోరేజ్ 510 అడుగులు కాగా అంతకంటే 6 అడుగుల దిగువకు నీటిమట్టలు పడిపోవడంతో భవిష్యత్తులో తాగునీటి అవసరాలకే కటకటయ్యే పరిస్థితి ఏర్పడింది. దీంతో ఈ ఏడాది కుడి, ఎడమ కాల్వల కింద ఆయకట్టులో సాగు ప్రశ్నార్థకంగా మారింది. ఆయకట్టు రైతులు ఉన్న బోర్లు ద్వారా సాగుకు రైతులు సన్నద్ధం అవుతున్నారు. సాగర్‌లో ప్రస్తుతం ఉన్న నీటిని కేవలం తాగునీటి అవసరాలకే వినియోగించుకోవచ్చునని అధికారులు అంచనా వేస్తున్నారు. దీంతో సాగర్ ఆయకట్టు పరిధిలో ఉన్న 23 లక్షల ఎకరాల్లో సాగు పరిస్థితి ▶ 2లో



గుంటూరులోని హిందూ కాలేజిలో నినాదాలు చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

విద్యా సంస్థల బంద్ విజయవంతం

పెద్ద ఎత్తున సహకరించిన విద్యార్థులు, యాజమాన్యాలు

ప్రజాశక్తి-గుంటూరు, పల్నాడు జిల్లా

దేశ వ్యాప్తంగా విద్యాసంస్థల బంద్‌లో భాగంగా విద్యార్థి సంఘాలు గురువారం గుంటూరు, పల్నాడు జిల్లాల్లో తలపెట్టిన బంద్ జయప్రదమైంది. అనేక విద్యా సంస్థలు బంద్‌కు సహకరిస్తూ ముందుగానే సెలవు ప్రకటించాయి. విద్యార్థులు పెద్ద సంఖ్యలో తరగతులు బహిష్కరించి, బంద్‌లో పాల్గొన్నారు. విద్యార్థి సంఘాల నాయకులు, కార్యకర్తలు హిందూ కాలేజి, ప్రభుత్వ ఉమెన్స్ కాలేజి, ఏసీ కాలేజి తదితర విద్యా సంస్థల్లో బంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివారెడ్డి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.కిరణ్, ఎన్ఎస్‌యుఐ జిల్లా ఉపాధ్యక్షులు తిరుమలరావు, పిడిఎస్‌యు నాయకులు ప్రసన్న, ఎస్ఎఫ్ఐ పల్నాడు జిల్లా కార్యదర్శి కోట సాయికుమార్ మాట్లాడుతూ బంద్‌కు అనూహ్య స్పందన వచ్చిందని, ఇది కేంద్ర ప్రభుత్వ విద్యా వ్యతిరేక విధానాలపై నిరసనకు నిదర్శనమని అన్నారు. కేంద్ర ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతోందన్నారు. పరీక్షల్లో అవకతకలకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఇటీవల నీట్ రాసి నష్టపోయిన విద్యార్థులకు కేంద్రం పరిహారం చెల్లించాలని, జీవో నెంబర్ 77ను రద్దు ▶ 2లో



పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలో పాఠశాల నుండి బయటకు వస్తున్న విద్యార్థులు

ఎఎన్‌ఎంలపై వైద్యాధికారి వేధింపులు

ప్రజాశక్తి-గుంటూరు



డిఎంహెచ్‌ఒకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మున్నంగి పిహెచ్‌సిలో పనిచేస్తున్న సచివాలయం హెల్త్ సెక్రటరీలపై పిహెచ్‌సి వైద్యాధికారి వేధింపులను అరికట్టాలని ఆంధ్రప్రదేశ్ గ్రామ, వార్డు, సచివాలయ హెల్త్ సెక్రటరీస్ వెల్ఫేర్ అసోసియేషన్ (సిఐటియు) నాయకులు కోరారు. ఈ మేరకు డిఎంహెచ్‌ఓ కె.విజయలక్ష్మికి గురువారం వినతిపత్రం అందచేశారు. గర్భిణులను కాన్పు కోసం ఆసుపత్రికి తీసుకువెళ్లిన సందర్భంలో ఆమెతోపాటు రేయింబవళ్లు ఎఎన్ఎంలు కూడా ఆసుపత్రిలోనే ఉండాలని సదరు వైద్యాధికారి ఆదేశించారని, అందుకు నిరాకరించిన ఎఎన్‌ఎంలపై వేధింపులకు పాల్పడుతున్నారని తెలిపారు. ఇలాంటి వేధింపులు భరించలేక ఆశాజ్యోతి అనే హెల్త్ సెక్రటరీ ఆసుపత్రి పాలయ్యారని చెప్పారు. అంతేకాకుండా వైద్యాధికారి ఎఎన్ఎంలను అభ్యంతరకరమైన పదజాలంతో దుర్భాషలాడుతున్నారని, రాత్రి పొద్దుపోయే వరకూ సమావేశాల పేరుతో ఆసుపత్రిలోనే ఉంచుతున్నారని, సెలవులు ఇతర అవసరాల కోసం వైద్యాధికారి వద్దకు వెళ్లినప్పుడు గంటల తరబడి నిలబెడుతున్నారని ఎఎన్ఎంలు వాపోయారు. డిఎంహెచ్‌ఓ డాక్టర్ కె.విజయలక్ష్మి స్పందిస్తూ హైరిస్క్ కేసులు ఉన్నప్పుడు సూపర్వైజర్లు, ఆ పైస్థాయి సిబ్బంది మాత్రమే ఆసుపత్రికి వెళ్లాలని, సాధారణ ▶ 2లో



అనుమతుల్లేని విత్తనాలు, పురుగు మందులు స్వాధీనం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

పల్నాడు జిల్లా బెల్లంకొండ మండలంలోని విత్తనాలు, పురుగు మందుల దుకాణాల్లో గుంటూరు విజిలెన్సు అధికారులు గురువారం తనిఖీలు చేశారు. ఎస్.ఆర్. ఆగ్రో కెమికల్స్ దుకాణంలో అనుమతులు లేకుండా విక్రయిస్తున్న రూ.2.40 లక్షల విలువైన పురుగు మందులు, రూ.18,240 విలువ కలిగిన 48 కిలోల కంది విత్తనాలు స్వాధీనం చేసుకున్నారు. శాంతి సీడ్స్‌లో రూ.22,420 విలువ చేసే 59 కిలోల కంది విత్తనాలు స్వాధీనం చేసుకున్నారు. తనిఖీల్లో వ్యవసాయ అధికారి రమణ కుమార్, సబ్‌ఇన్‌స్పెక్టర్ ఎం.రామచంద్రయ్య, బెల్లంకొండ వ్యవసాయ అధికారి కృష్ణయ్య పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో ఆక్స్‌ఫర్డ్ ప్రిన్సిపల్ మృతి

ప్రజాశక్తి - దాచేపల్లి/పిడుగురాళ్ల



గుమ్మడి నాగిరెడ్డి మృతదేహం

మండల కేంద్రమైన దాచేపల్లిలోని ఆక్స్‌ఫర్డ్ స్కూల్ ప్రిన్సిపల్‌గా పనిచేస్తున్న గుమ్మడి నాగిరెడ్డి(46) అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన విషయం గురువారం వెలుగుచూసింది. మృతుడు నాగిరెడ్డి ఈనెల ఒకటో తేదీ నుంచి కన్పించడం లేదని మూడ్రోజుల కిందట కుటుంబ సభ్యులు పోలీసుల ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో గురువారం వాసవి గ్రీన్ సిటీలో గుర్తు తెలియని మృతదేహం బయటపడగా నాగిరెడ్డిగా కుటుంబ సభ్యులు గుర్తించడంతో పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహం గుర్తించలేని స్థితిలో ఉంది. నాగిరెడ్డికి ఇద్దరు కుమారులున్నారు. ఏడాది క్రితం ఆయన భార్య మృతి చెందింది. ఆయన ప్రిన్సిపల్ ఉద్యోగంతో పాటు ఫైనాన్స్ వ్యాపారం కూడా చేస్తుంటాడని, ఆర్థిక లావాదేవీల నేపథ్యంలో హత్య చేశారా? లేక కుటుంబ సమస్యలతో ఆత్మహత్య చేసుకున్నారా అనే కోణంలో దర్యాప్తు జరుగుతోంది. పోస్టుమార్టం నిమిత్తం మతదేహాన్ని గురజాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు దాచేపల్లి ఎస్ఐ నాగరాజు తెలిపారు.

రాజకీయ ఒత్తిళ్ల ప్రచారంలో వాస్తవం లేదు

ప్రజాశక్తి - అచ్చంపేట

డ్వాక్రా సంఘాల అభివృద్ధికి తోడ్పడాలని మండల సమైక్య అధ్యక్షులు చల్లా రత్నమంజీరా అన్నారు. మండల సమైక్య కార్యాలయంలో గురువారం ఆమె విలేకర్లతో మాట్లాడారు. యానిమేటర్లపై రాజకీయ ఒత్తిళ్లు వస్తున్నాయంటూ చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదన్నారు. ఎన్నో ఏళ్లుగా డ్వాక్రా సంఘాలు గ్రూపులు ఏర్పాటు చేసి వారికి రుణాలిప్పిస్తూ సకాలంలో వాటిని వసూలు చేస్తున్నామని, ప్రభుత్వం నుండి మహిళలకు వస్తున్న పథకాల ద్వారా వారి ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు ఇస్తున్నామని చెప్పారు. తామంతా కలిసే పనిచేస్తున్నామన్నారు.

ఘనంగా ఎస్వీ రంగారావు జయంతి

ప్రజాశక్తి - వినుకొండ



గుమ్మడి కళాపీఠం ఆధ్వర్యంలో సినీ నటులు ఎస్వీ రంగారావు జయంతిని కళాకారులు గురువారం ఘనంగా నిర్వహించారు. రంగారావు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అంతర్జాతీయ పురస్కారం పొందిన తొలి దక్షిణ భారత నటుడు ఎస్.వి.ఆర్ అని కొనియాడారు. కార్యక్రమంలో ఎం.రామయ్య, జె.శ్రీనివాసరావు, పి.సుబ్రహ్మణ్యం, జాజ్ కోటి పాల్గొన్నారు.

హాస్టల్‌కు సీలింగ్ ఫ్యాన్లు బహూకరణ

ప్రజాశక్తి - అచ్చంపేట

స్థానిక బీసీ బాలికల హాస్టల్‌కు స్నేహహస్తాలు ఫౌండేషన్ ఆధ్వర్యంలో నాలుగు ఫ్యాన్‌లను సమకూర్చారు. చెరుకుంపాలెం గ్రామాభివృద్ధి సంఘం అధ్యక్షులు తుమ్మ శౌరెడ్డి ద్వారా హాస్టల్ అధికారి శైలజకు గురువారం అందించారు. ఈ సందర్భంగా శైలజ మాట్లాడుతూ విద్యార్థులు ఇబ్బందులు పడకుండా వారికి మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా స్నేహ హస్తాలు ఫౌండేషన్ సీలింగ్ ఫ్యాన్లు అందించడంపై ధన్యవాదాలు తెలిపారు. ఎన్నో పాఠశాలలకు ఇలా సహకరిస్తున్న ఫౌండేషన్‌కు అభినందనలు చెప్పారు. కార్యక్రమంలో కో-ఆర్డినేటర్ కరిముల్లాబాబు పాల్గొన్నారు.

విఆర్‌ఎ నాగేశ్వరరావు మృతి

ప్రజాశక్తి - బెల్లంకొండ

మండలం కేంద్రమైన బెల్లంకొండకు చెందిన, గంగిరెడ్డిపాలెం విఆర్ఎగా పని చేస్తున్న గొర్రెపాటి నాగేశ్వరరావు (63) అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. ఆయన భౌతికకాయాన్ని వైసిపి నాయకులు జి.చినబాబురావు, పాకాలపాటి షేక్ మౌలాలి, గుర్రాల షేక్ కరిముల్లా, కావూరి షేక్ దరియా, చావలి రామయ్య సందర్శించి నివాళులర్పించారు. నాగేశ్వరరావు కుటుంబీకులకు ప్రగాఢ సానుభూతి తెలిపి అండగా ఉంటామని ధైర్యం చెప్పారు.

చోరీ సెల్‌ఫోన్ల రికవరీ

ప్రజాశక్తి - చిలకలూరిపేట

పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో సెల్ ఫోన్ పోగొట్టుకున్న ఐదుగురికి వారి ఫోన్లను రికవరీ చేసి ఇచ్చామని పట్టణ ఎస్ఐ పి.రమేష్ గురువారం తెలిపారు. ఫోన్ల విషయంలో జాగ్రత్తగా ఉండాలని, రద్దీ ప్రదేశాల్లో తమ వస్తువులను తరచూ పరిశీలిస్తూ ఉండాలని సూచించారు. ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన డ్రామా డైరెక్టర్లు, డ్యాన్స్ మాస్టర్లు

ప్రజాశక్తి - వినుకొండ

జాషువా కళానికేతన్ ఆధ్వర్యంలో నియోజకవర్గ డ్రామా డైరెక్టర్స్, డాన్స్ మాస్టర్ల సంఘ సమావేశం సంఘ మాజీ అధ్యక్షులు పి.ఐ. కుమార్ కార్యాలయంలో గురువారం జరిగింది. సమస్యలపై చర్చించిన అనంతరం ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులును కలిసి సత్కరించారు. సమస్యల పరిష్కారానికి ఆయన హామీనిచ్చారు. సంఘ అధ్యక్షులు ఎన్.హరిబాబు, ఉపాధ్యక్షులు ఎ.సాల్మన్ రాజు, మాజీ అధ్యక్షులు పిఐ కుమార్, డాన్స్ మాస్టర్ స్కైలాబ్, డైరెక్టర్స్ ఎం.కోటి, వాసు, కె.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

75 శాతం రాయితీపై గడ్డి విత్తనాలు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

పశుపోషణకు మేలైన గడ్డిని పశువులకు పెట్టాలని పాడిరైతులకు పశుసంవర్ధక శాఖ ఉపసంచాలకులు పి.రామారావు సూచించారు. మండలంలోని నందిగామలో రైతులకు రాయితీ పై గడ్డి విత్తనాలను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ పాడి రైతులకు 75 శాతం రాయితీపై గడ్డి విత్తనాలను అందిస్తున్నామని చెప్పారు. మేలైన గడ్డి విత్తనాలను నాటటం ద్వారా పలు దఫాలుగా గడ్డి కోసుకోవచ్చున్నారు. జిల్లాకు 49 టన్నుల విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, పశు వైద్యశాలల ద్వారా వీటిని రైతులు పొందవచ్చని చెప్పారు. కార్యక్రమంలో సహాయ సంచాలకులు ఎన్సీహెచ్ నరసింహులు , పెదమక్కెన పశు వైద్యశాల డాక్టర్ శిరీష పాల్గొన్నారు.

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రొంపిచర్ల మండలం కర్లకుంట పశు వైద్యశాలలో గురువారం రైతులకు రాయితీపై గడ్డి జొన్నలు పంపిణీ చేశారు. పశు వైద్యాధికారి డాక్టర్ సాయిమహేష్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం సి.ఎస్.హెచ్ 24 ఎం.ఎఫ్ విత్తనాలను ఎకరాకు 20 కిలోల చొప్పున రాయితీపై ఇస్తున్నట్లు చెప్పారు. 5 కిలోల జొన్న గడ్డి విత్తనాలను రాయితీపై రూ.125కు ఇస్తామన్నారు. కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ సహాయకులు నాగుల్ మీరా, రాజు, హైమావతి, సిబ్బంది, పశుపోషకులు పాల్గొన్నారు.

అంతర్ పంటల సాగుతో తెగుళ్ల నివారణ

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

ప్రకృతి వ్యవసాయంపై చిన్న, సన్నకారు రైతులు దృష్టి సారించాలని ఎంసిఆర్‌పి శైలజ అన్నారు. మండలంలోని గోరంట్లలో దళిత బహుజన రిసోర్స్ సెంటర్ (డిబిఆర్‌సి), సేవే ప్రాణం సేవే జీవితం సంస్థ ఆధ్వర్యంలో చిన్న, సన్న కారు రైతులకు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా డ్రమ్ములు, టార్పాలిన్ పట్టాలు గురువారం పంపిణీ చేశారు. కార్యక్రమానికి డిబిఆర్‌సి రీజనల్ కో-ఆర్డినేటర్ మల్లెల చిన్నప్ప అధ్యక్షత వహించగా శైలజ మాట్లాడుతూ రైతులు భూసార పరీక్షలు చేయించుకొని భూసారాన్ని బట్టి పంటలు మార్పిడి చేయాలని చెప్పారు. పత్తి పంటలో మొక్క మధ్యలో కందులు, బెండ విత్తనాలు నాటితే పురుగు, తెగుళ్లు ఆశించవని తెలిపారు. మిర్చి పంటకు రక్షణగా చేను చుట్టూ ఆముదాలు, కందులు వేసుకోవాలని, తూర్పు పడమర మాత్రమే సాలు ఉండే విధంగా చూసుకోవాలని చెప్పారు. సూర్యుడు ఉదయించేటప్పుడు అస్తమించేటప్పుడు సూర్యరశ్మి మొక్క వేళ్లకు తగిలినట్లయితే పురుగు ఆశించదనీ, ఎండకు పురుగు



సత్తెనపల్లి మండలం నందిగామలో రైతులకు గడ్డి విత్తనాలు అందిస్తున్న అధికారులు

చనిపోతుందని వివరించారు. ఆవు పేడ, గోమూత్రం, బెల్లం, శెనగపిండి, ఎర్ర మట్టితో జీవామృతం తయారుచేసి పిచికారి చేస్తే పంటలకు తెగుళ్ల ఆశించకుండా ఎక్కువ దిగుబడులు వస్తాయని వివరించారు. కార్యక్రమంలో సేవే ప్రాణం సేవ జీవితం సంస్థ ప్రతినిధి నందిగామ నాగేశ్వరరావు, రైతులు, మహిళా రైతులు పాల్గొన్నారు.

తూనికలు కొలతల శాఖ తనిఖీలు

ప్రజాశక్తి - క్రోసూరు

తూనికలు, కొలతల శాఖ ఫుడ్ ఇన్స్పెక్టర్ అధికారులు క్రోసూరు, అచ్చంపేట మండలాల్లోని పలు కిరాణా షాపులలో గురువారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. మండల కేంద్రమైన క్రోసూరులో పలు కిరాణా షాపులపై ఫిర్యాదుల నేపథ్యంలో జిల్లా తూనికలు, కొలతల శాఖ అధికారి షేక్ జాన్ సైదా, ఫుడ్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు తనిఖీలు నిర్వహించి కిరాణా షాపులోని ప్యాకేజీలపై తయారీకేంద్రం చిరునామా, కస్టమర్ కేర్ నెంబర్, అడ్రస్ లేకపోవడాని గుర్తించారు. అచ్చంపేటలో రెండు కిరాణా షాపులపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. క్రోసూరులో తూకం తక్కువ చేసి అమ్ముతున్న మూడు చికెన్ షాపులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పత్తి తూకం లోతేడా, ఆటోమొబైల్ షాపులో మ్యానుఫ్యాక్చరింగ్ లేకపోవడంతో వారిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా తూనికలు, కొలతల శాఖ అధికారి మాట్లాడుతూ వ్యాపారస్తులు తమ దుకాణాలలో డిక్లరేషన్ లేని ప్యాకేజీలు అమ్మరాదని, అటువంటివి తనిఖీలలో దొరికితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్యాకింగ్ చేసేవారు విధిగా ప్యాకింగ్ లైసెన్స్ తీసుకోవాలని, వేయింగ్ మిషన్స్ వాడేవారు వెరిఫికేషన్



సర్టిఫికెట్లు తీసుకోవాల్సి ఉంటుందని సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ఉంటాయని అన్నారు. వినియోగదారులు కోరితే వారికి తమ వేయింగ్ మిషన్ కరెక్ట్‌గా ఉందా లేదా అనే విషయాన్ని ఒకటి నుంచి ఐదు కేజీల వరకు ఏదైనా బాటు పెట్టి చూపించాల్సి ఉంటుందన్నారు.

ఆశ,నిరాశల మధ్య ఖరీఫ్

(మొదటి పేజీ తరువాయి)

మరో 1200 ఎకరాల్లో వేశారు. ఇటీవల కురిసిన వర్షాలతో రెండు జిల్లాల పరిధిలో మెట్ట భూముల్లో వెంటనే పత్తి, అపరాల సాగుకు అవకాశాలు మెరుగుపడ్డాయి. కానీ వరిసాగుపై అస్పష్టత కొనసాగుతోంది.

గుంటూరు జిల్లాలో జూన్ నెలలో మొత్తం 97.1 మిల్లీ మీటర్ల వర్ష పాతం నమోదు కావాల్సి ఉండగా 30వ తేదీ వరకు 160.5 మిల్లీ మీటర్లవర్షపాతం నమోదైంది. 15 మండలాల్లో అవసరానికి మించి వర్షపాతం నమోదు కాగా తాడేపల్లి, తుళ్లూరు, మేడికొండూరు మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. జులై నెలలో 164.9 మిల్లీ మీటర్లకు గాను ఇప్పటివరకు 12.5 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. పల్నాడు జిల్లాలో జూన్‌నెలలో 80.9 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా నెల మొత్తం మీద 102.9 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. జులైలో ఇప్పటి వరకు జల్లులతో ఒక మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. దీంతో రైతులు అయోమయంలో ఉన్నారు. ఒక వైపు ఆల్మట్టి నుంచి పులిచింతల వరకు కనీస నీటి నిల్వలు లేకపోవడంతో నాగార్జున సాగర్ ఆయకట్టులో సాగుపై రైతులు మీమాంసలో ఉన్నారు.

గత 9 నెలలుగా సరైన వర్షాలు లేక కృష్ణాపరివాహక ప్రాంతంలో నీటి ఎద్దడి ఏర్పడింది. పులిచింతలలో గరిష్ట నీటి నిల్వ 45.77 టీఎంసీలు కాగా కేవలం 0.43 టిఎంసీలు మాత్రమే ఉండటం గమనార్హం. పులిచింతల నుంచి ప్రకాశం బ్యారేజికి కూడా నీటి విడుదల లేకపోవడం వల్ల ప్రకాశం బ్యారేజి వద్ద నీటి నిల్వ 3.50 టీఎంసీల నుంచి 2.08 టీఎంసీలకు తగ్గింది. ప్రకాశం బ్యారేజి నుంచి 13.74 లక్షల ఎకరాలకు సాగు నీటిని అందించాల్సి ఉండగా నీరు లేకపోవడంతో రైతులు సాగుకు ముందుకు వెళ్లలేకపోతున్నారు. ఈ పరిస్థితుల్లో గోదావరి నుంచి పట్టిసీమ ద్వారా కృష్ణా డెల్టాకు నీరు వస్తుందన్న సమాచారం రైతుల్లో ఆశలు చిగురింపచేసింది. గత నెల రోజులుగా నైరుతీ రుతుపవనాల వేగం మందగించడం, వారంలో ఒక రోజు వర్షం పడితే మిగతా ఆరు రోజులు ఎండల తీవ్రత అధికంగా ఉండటం వల్ల సాగుకు అనువైన పరిస్థితులు ఏర్పడకపోవడం వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ పరిస్థితులో గోదావరి జలాలు కృష్ణాడెల్టాకు మరో రెండు రోజుల్లో వస్తాయని తెలిసి రైతులు కొంత మేరకు ఆశగా నీటి కోసం ఎదురుచూస్తున్నారు.

అడుగంటిన నాగార్జున సాగర్ జలాశయం

(మొదటి పేజీ తరువాయి)

డోలాయనంలో పడింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ కలిపి ఐదు జిల్లాల్లో సుమారు 23 లక్షల ఎకరాల ఆయకట్టు ఆధారపడి ఉంది. నల్గొండ, ఖమ్మం జిల్లాల్లోనే 7,10,939 ఎకరాల ఆయకట్టు ఉంది. కృష్ణా, ప్రకాశం, ఉమ్మడి గుంటూరు జిల్లాల్లో మొత్తం 15.16 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. ప్రస్తుతం వర్షాలు ఆశాజనకంగా ఉన్న ప్రాంతాల్లో మెట్ట పంటలు సాగు చేస్తున్నారు. అయితే వరి సాగుపై ప్రభుత్వం నుంచి ఇంత వరకు ప్రకటనేమీ రాలేదు. కొన్నేళ్లుగా ఆగస్టు, సెప్టెంబర్‌లలోనే ఎక్కువగా నీటి విడుదల చేస్తున్నారు. గత నెలలో పల్నాడు జిల్లాలో సాధారణ వర్షపాతం మాత్రమే నమోదవడంతో జులైలో కురిసే వర్షాల ఆధారంగా సాగుపై రైతులు నిర్ణయం తీసుకుంటారు. మరో పక్షం రోజులు వేచిచూడాల్సిన పరిస్థితి నెలకొంది. వర్షాలు బాగాపడి, బోర్లు వసతి ఉన్న ప్రాంతాల్లోనే రైతాంగం సాగు పనుల్లో నిమగ్నమయ్యారు.

విద్యా సంస్థల బంద్ విజయవంతం

(మొదటి పేజీ తరువాయి)

చేయాలని, పిహెచ్‌డి అడ్మిషన్ల కోసం ఇటీవల ఆమోదించిన తప్పనిసరి నెట్‌స్కోర్ విధానాన్ని వెనక్కి తీసుకోవాలని, టిఐఎస్ఎఫ్, ముంబై ఐఐటీ ముంబై, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీల్లో విద్యార్థి సంఘాల నేతలపై మోపిన అక్రమ కేసులు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. బిజెపి హయాంలో 67,800పైగా స్కూల్స్ మూతపడ్డాయని, స్కూల్స్ మూసివేతను ఆపాలన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న పరీక్షల నిర్వహణను రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు షేక్.సమీర్, జిల్లా గర్ల్స్ కన్వీనర్ బి.సుచరిత, జిల్లా నాయకులు యశ్వంత్, ఆరిఫా, భగత్‌సింగ్, నగర నాయకులు షంషీర్, ఆరిఫ్, రోహిత్, హర్ష, ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బందెల నాసర్‌జీ, నగర కార్యదర్శి ఏశ్వంత్, ఎన్ఎస్‌యుఐ నాయకులు సుమన్, కోటేష్‌బాబు, మదన్, పిడిఎస్‌యు జిల్లా నాయకులు మానస, చరిత, ఎస్ఎఫ్ఐ పల్నాడు జిల్లా నాయకులు డి.అమూల్య, విక్రమ్, మణి, రోహిత్, సత్తి, ప్రసాద్, సంతోష్ పాల్గొన్నారు.

ఎఎన్‌ఎంలపై వైద్యాధికారి వేధింపులు

(మొదటి పేజీ తరువాయి)

కేసుల్లో ఎఎన్ఎంలు ఆసుపత్రికి వెళ్లి వారిని ఆసుపత్రిలో చేర్చాలని, కానీ రేయింబవళ్లు ఆసుపత్రిలో ఉండాల్సిన అవసరం లేదని చెప్పారు. ఇందుకు భిన్నంగా వైద్యాధికారులు ఆదేశాలిస్తే వెంటనే తన దృష్టికి తేవాలని, దానిపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నేతాజీ, ఎపి హెల్త్ సెక్రటరీస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కె.అన్నమ్మ, యునైటెడ్ మెడికల్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు జె.శ్యామ్, మున్నంగి పిహెచ్‌సి కమిటీ నాయకులు జై.హేమలత, డి.అనిత ప్రియదర్శిని, పి.కుసుమ పాల్గొన్నారు.

చిరుద్యోగులపై రాజకీయ వేధింపులు ఆపాలి

ప్రజాశక్తి-గుంటూరు :వివిధ రంగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ స్కీం వర్కర్లపై రాజకీయ వేధింపులు సరికాదని తక్షణమే రాజకీయ వేధింపులు ఆపాలని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ముజఫర్ అహ్మద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా చిరుద్యోగులు అయిన కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్, స్కీం వర్కర్లపై రాజకీయ వేధింపులు పాల్పడుతున్నారని, దీని వల్ల ఆయా కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని అన్నారు.తక్షణమే రాజకీయ వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. గురువారం స్థానిక సిఐటియు జిల్లా కార్యాలయంలో యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షుడు జి.పవన్ అధ్యక్షతన నిర్వహించారు. ఈసందర్భంగా ముజఫర్అహ్మద్ మాట్లాడుతూ ప్రభుత్వాలు మారినప్పుడల్లా కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులపై అధికార పార్టీలు వారి ఆధిపత్యం చెలాయించటం, ఉద్యోగులను ఇబ్బందులు గురి చేయటం పరిపాటిగా మారిందన్నారు. ప్రభుత్వ విధులు సక్రమంగా నడిచేందుకు ఉద్యోగులు కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులు స్కీమ్ వర్కర్లు కీలకమైన పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. చిరుద్యోగుల్ని వేధింపులకు గురి చేసిన ఏ ప్రభుత్వమూ మనుగడ సాధించలేదని అన్నారు. ప్రస్తుత ప్రభుత్వమైనా స్కీమ్ వర్కర్లు, కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంక్షేమానికి చర్యలు తీసుకోవాలని కోరారు. యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు జల్లెడ రాజశేఖర్ మాట్లాడుతూ విద్యుత్ రంగంలో కాంట్రాక్ట్ కార్మికులు అనేక రకాల సమస్యలు ఎదుర్కొంటున్నారని వాటి పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. విద్యుత్ సబ్‌స్టేషన్‌లో షిఫ్ట్ ఆపరేటర్లు పనిచేస్తున్న చోట వాచ్‌మెన్ లేని కారణంగా సబ్ స్టేషన్‌లో పాములు, విద్యుత్తు అంతరాయం జరిగిన సమయంలో వాటిని పునరుద్ధరించేందుకు చేపట్టాల్సిన చర్యల సందర్భంగా అనేక చోట్ల యాక్సిడెంట్లు, పాము కాటుతో షిఫ్ట్ ఆపరేటర్లు చనిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ప్రతి సబ్ స్టేషన్‌కు వాచ్‌మెన్‌ను కేటాయించాలని కోరారు. జాతీయ పండగ సెలవు దినాలకి ఇవ్వాల్సిన పేయిడ్ హాలిడేస్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని, విద్యుత్ సబ్‌స్టేషన్‌లో కనీసమైన మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు చేపట్టాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు. సమావేశంలో జిల్లా గౌరవాధ్యక్షులు బి.లక్ష్మణరావు, జిల్లా కార్యదర్శి జి.నాగరాజు, నాయకులు వంశీ, రామచంద్రయ్య, వీరారెడ్డి, రమేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాజశేఖర్

పారిశుధ్య కార్మికులకు జీవో 36 ప్రకారం రూ.21వేలు చెల్లించాలి

ఎపి మున్సిపల్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి తాడేపల్లి రూరల్

మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో విలీనమైన గ్రామాల పారిశుధ్య కార్మికులకు, గత ఆరు నెలలుగా జీవో నెంబర్ 36 ప్రకారం చెల్లించాల్సిన రూ.21వేలను వెంటనే చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఫెడరేషన్ సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కే ఉమామహేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఎంటీఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం జాతీయ రహదారి వద్ద ఉన్న కేబి భవన్‌లో తాడేపల్లి మండల మున్సిపల్ వర్కర్స్ సమావేశం సంఘం మండల అధ్యక్షులు చొక్కా మరియదాసు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ లో విలీనమైన గ్రామాలలో పనిచేసే పారిశుధ్య కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జీవో ప్రకారం వేతనాలు అందడం లేదని అన్నారు. అదేవిధంగా మున్సిపల్ వర్కర్స్‌కు ఈఎస్ఐ, పిఎఫ్ కార్డులు ఇప్పటికీ కార్మికులకు ఇవ్వకపోవడం సరైన పద్ధతి కాదన్నారు. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి మున్సిపల్ కార్మికులకు ఈఎస్ఐ,పిఎఫ్ కార్డులు ఇవ్వాలని ఆయన అన్నారు. వారంతపు సెలవులు, క్యాజువల్ లీవ్స్ సక్రమంగా అమలు చేయాలని అన్నారు. కొత్తగా రాష్ట్రంలో ఏర్పడ్డ ప్రభుత్వం అక్కడక్కడ కార్మికులను తొలగిస్తారని ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో మున్సిపల్ కార్మికులకు పని, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ మున్సిపల్ వర్కర్స్ కార్యదర్శి ఎస్ ఎస్ చెంగయ్య మాట్లాడుతూ కార్మికులందరూ ఐక్యంగా నిలబడి, సమస్యల పరిష్కారం అయ్యేందుకు కృషి చేయాలన్నారు. కార్మికులకు అభద్రతాభావం కలగకుండా ఉద్యోగ భద్రత కల్పించాలని అన్నారు.36 జీవో ప్రకారం ఆరు నెలల బకాయిలను కార్మికులకు వెంటనే చెల్లించాలన్నారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు జొన్న శివశంకరరావు, సిఐటియు తాడేపల్లి మండల నాయకులు దొంతి రెడ్డి వెంకటరెడ్డి, కౌలు రైతు సంఘం తాడేపల్లి మండల కార్యదర్శి పల్లె కష్ణ, మున్సిపల్ కార్మికులు ప్రసన్న, పి మరియమ్మ, ప్రశాంత్, జోజీ బాబు, సరోజిని, కృష్ణ తులసి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు



బిటెక్ విద్యార్థి అరెస్టు - 8 వాహనాలు స్వాధీనం

ప్రజాశక్తి-గుంటూరుజిల్లా ప్రతినిధి

ద్విచక్ర వాహనాలను దొంగిలిస్తున్న విద్యార్థి ఒకరిని అరెస్టు చేసి 8 వాహనాలను స్వాధీనం చేసుకున్నామని కొత్తపేట సిఐ అన్వర్ భాషా గురువారం మీడియాకు తెలిపారు. శ్రీకాకుళం జిల్లాకు చెందిన విద్యార్థి ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో బిటెక్ చివరి సంవత్సరం చదువుతున్నాడు. జల్సాలకు అలవాటుపడి డబ్బుల కోసం వాహనాలను దొంగతనం చేస్తున్నట్టు పోలీసుల విచారణలో వెల్లడించాడు. గుంటూరు కొత్తపేటలో ఇతన్ని అరెస్టు చేసి ఇతని వద్ద రూ. 5 లక్షల విలువైన 8 వాహనాలను స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. బిటెక్ చదువుతూ చెడు వ్యసనాలకు, జల్సాలకు అలవాటు పడి తన జల్సాలకు లోన్ యాప్‌లలో అప్పులు తీసుకుని వాటిని తిరిగి చెల్లించేందుకు, తన వ్యసనాలకు డబ్బులు అవసరం అయ్యి, సులభంగా డబ్బులు సంపాదిద్దమని అని అనుకుని అరిగిపోయిన తాళాలను మాయబజార్ రొడ్డు లలో ఏరుకుని వాటి సహాయంతో పార్కింగ్ స్థలములలో పార్క్ చేసి ఉన్న బైకులను దొంగతనం చేస్తున్నాడని సిఐ తెలిపారు. కొత్తపేట సిఐ అన్వర్ భాషా ఆధ్వర్యంలో ఎస్ఐ తరంగిణి కేసు దర్యాప్తుచేస్తున్నారు.

భార్యను హతమార్చిన భర్త

ప్రజాశక్తి - యడ్లపాడు

తిమ్మాపురం గ్రామంలోని ఎస్సీకాలనీలో భార్యను భర్త హత్య చేసిన సంఘటన గురువారం ఉదయం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..ఎస్సీకాలనీకు చెందిన టైలర్ వృత్తిని కొనసాగిస్తున్న 65 ఏళ్ల రావూరి నాగేశ్వరరావు గురువారం ఉదయం 8 గంటల సమయంలో మద్యం సేవించారు. కొద్దికాలంగా భార్యపై అనుమానం పెంచుకున్న నాగేశ్వరరావు ఇంట్లో గేదె మాంసాన్ని విక్రయానికి సిద్ధం చేస్తున్న భార్య వేదకుమారి (55) వెనుకగా వచ్చి గొడ్డలితో తలపై మోదాడు. దీంతో కుప్పకూలిన వీరకుమారిని కుటుంబ సభ్యులు, స్థానికులు గమనించి చిలకలూరిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. పోలీసుల అదుపులో నాగేశ్వరరావు ఉన్నట్లు సమాచారం. మృతురాలికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ జె శామ్యూల్ రాజీవ్‌కుమార్ తెలిపారు



మిర్చి నిల్వలు

		బ్యాగులు
మిర్చి దిగుమతి	:	31,751
మిర్చి ఎగుమతి	:	33,108
మిర్చి నిల్వ	:	17,419

మిర్చి ధరలు

	రూపాయలలో
334	9,000 - 17,000
నెం.5	8,000 - 11,000
273	12,000 - 12,500
341	10,000 - 16,000
సూపర్10	13,000 - 18,500
నాన్ ఎసి స్పెషల్ వెరైటీ	
తేజ	8,000 - 19,200
బడిగి	9,000 - 17,500
దేవనూరు డీలక్స్	10,000 - 15,000
తాలుకాయలు	5,000 - 12,500
ఎసి కామన్ వెరైటీ	
334	9,000 -13,500
నెం.5	14,000 - 14,000
273	9,000 - 18,000
341	8,500 - 16,000
4884	16,200 -16,200
ఎసి స్పెషల్ వెరైటీ	
తేజ	10,000 - 19,000
బడిగి	9,500 - 14,700
దేవనూరు డీలక్స్	10,000 - 11,000
తాలుకాయలు	6,000 - 11,500



మంత్రి నారాయణతో ఉండవల్లి రైతుల భేటి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

తాడేపల్లికి చెందిన రైతులు మునిసిపల్ మంత్రి పి.నారాయణతో గురువారం సాయంత్రం ఆయన సమావేశం అయ్యారు. తుళ్లూరు లోని సి ఆర్ డి ఏ కార్యాలయం లో రైతులతో సమావేశం జరిగింది ఉండవల్లి లో సీడ్ యాక్సిస్ రోడ్డులో భూములు కోల్పోతున్న రైతులు మంత్రిని కలిసి తమ సమస్యలు విన్నవించారు. రైతులను తమ డిమాండ్ లను మంత్రి నారాయణకు తెలియచేశారు. రైతుల డిమాండ్లను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దష్టికి తీసుకువెళ్ళి తగిన న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. భూములను భూ సమీకరణలో తీసుకుని తమకు కూడా గతంలో రైతులకు ఇచ్చినట్టుగానే రిటర్నబుల్ ప్లాట్లు ఇవ్వాలిన రైతులు కోరారు.

ప్రయాణికులకు ఇబ్బంది కలిగించవద్దు



ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు ఎన్టీఆర్ బస్టాండ్‌కు వచ్చే ప్రయాణికులకు అన్ని రకాల వసతులు కల్పించాలని, బస్టాండ్ బయట బస్సులు ఎక్కువ సేపు నిలప కుండా, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకు ండా తగు చర్యలు తీసు కోవాలని ఆర్‌టిసి అధికారులకు ఎమ్మెల్యే మహ్మద్ నసీర్ సూచించారు. గురువారం తన కార్యాలయంలో రవాణా సమస్యలపై రీజనల్ మేనేజర్ రవికాంత్ తో ఆయన చర్చించారు. ఆర్టీసీ బస్టాండ్ పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని, ప్రయాణికులకు త్రాగునీటి సౌకర్యం కల్పించాలని, ఆర్‌టిసి బస్సులు షెడ్యూల్ టైం ప్రకారం నడపాలని ఎమ్మెల్యే నసీర్ తెలిపారు. విజయవాడ వైపు వెళ్ళు బస్సులు ఆగే బస్టాండ్ బయట మార్కెట్ వెనుక పల్నాడు బస్టాండ్ వద్ద బస్సుల క్రమబద్ధీకరణ ఉండుట లేదని ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా క్రమబద్ధీకరణకు తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆర్టీసీకి ఆదాయాన్నిచ్చే వనరులైన ప్రయాణికుల సౌక ర్యాల పట్ల శ్రద్ధ వహించాలని ఎమ్మెల్యే నసీర్ ఆర్టీసీ అధికారులను ఆదేశించారు.

ఘనంగా వంగవీటి రంగా జయంతి

ప్రజాశక్తి- విలేకర్లు : వంగవీటి మోహన్‌రంగ 77వ జయంతి జిల్లాలో పలుచోట్ల నిర్వహించారు.తాడేపల్లిలో వైసిపి తాడేపల్లి పట్టణ అధ్యక్షులు బి.వేణు గోపాలసోమిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. మంగళగిరిలో ఎంటిఎంసి ఎదురుగా ఉన్న రంగా విగ్రహానికి జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ చల్లపల్లి శ్రీనివాసరావు తదితర నాయకులు నివాళులర్పించారు. తాడేపల్లి రూరల్ పరిధిలో కుంచనపల్లి గాంధీ బొమ్మ సెంటర్, ప్రాతూరు రోడ్, కుంచనపల్లి హైవే జనసేన, పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ మాజీ శాసనసభ్యులు వంగవీటి మోహన్ రంగా జయంతి వేడుకలు టిడిపి, జనసేన శ్రేణులు ఘనంగా నిర్వహించారు.అనంతరం కేక్ కట్ చేసి ప్రభుత్వ పాఠశాలలో పిల్లలకి బుక్స్, పెన్స్, స్వీట్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు మేకల రాజా, కానుగోలు కోటేశ్వరరావు పాల్గొన్నారు.



ఆస్పత్రిలో తనిఖీలు చేస్తున్న జిల్లా కో-ఆర్డినేటర్ రంగారావు

రక్తపరీక్షలు, స్కానింగ్ బయటకు రాస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్ : ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు ఉచితంగా చేయాల్సిన రక్తపరీక్షలు, స్కానింగ్ పరీక్షలు బయటకు రాసే వైద్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని వైద్య విధాన పరిషత్ పల్నాడు జిల్లా కో-ఆర్డినేటర్ హెచ్‌ఎస్ రంగారావు హెచ్చరించారు. సత్తెనపల్లి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిపై ఆరోపణల నేపథ్యంలో ఆస్పత్రిని ఆయన గురువారం తనిఖీ చేశారు. ఆయా విభాగాలు, రికార్డులను పరిశీలించారు. వైద్యులు, వైద్య సిబ్బంది పనితీరుపై మండిపడ్డారు. సూపరింటెండెంట్ డాక్టర్ బి.రామకృష్ణ నుండి వివరాలు సేకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆస్పత్రిలో సమస్యలున్న మాట వాస్తవమేనని, వాటిని సరిదిద్దుకొనేలాగా వైద్యులు, సిబ్బందికి సూచనలిచ్చినట్లు చెప్పారు. రక్త పరీక్షలు, స్కానింగ్‌లు ఆసుపత్రిలో రోగులకు అందుబాటులో ఉన్నాయన్నారు. వైద్యులు ఎవరైనా రక్త పరీక్షలు, స్కానింగ్‌లు బయటకు రాస్తే చర్యలు తీసుకుంటామని అన్నారు. వైద్యులపై వస్తున్న ఆరోపణలు నిజమని తేలితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ వైద్యశాలలో నెలకు రోగులకు 60 వేల పరీక్షలు చేస్తున్నామని, ఆసుపత్రిలో 160 రకాల రక్త పరీక్షలు ఉచితంగా చేస్తున్నామని చెప్పారు. ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు రోగులకు వైద్యులు అందుబాటులో ఉండాలని ఆదేశించినట్లు స్పష్టం చేశారు.



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న ఆరోగ్య మిత్రలు

ఎమ్మెల్యేకు ఆరోగ్య మిత్రల వినతి

ప్రజాశక్తి - వినుకొండ : ఆరోగ్య మిత్ర, ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ ఉద్యోగుల సమైక్య నాయకులు ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులుకు విన్నవించారు. ఈ మేరకు ఎమ్మెల్యేను క్యాంపు కార్యాలయంలో గురువారం కలిశారు. 17 ఏళ్లగా ఆరోగ్యశ్రీ పథకంలో మిత్రలుగా పనిచేస్తున్నామని, తమకు సంక్షేమ పథకాలేమీ వర్తించడం లేదని చెప్పారు. ఓటమి మేనిఫెస్టోలో పెట్టిన విధంగా తమకూ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని, హెచ్‌ఆర్సీ పాలసీ అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సీనియారిటీ ప్రకారం రాబోయే పిఆర్సీల్లో ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. సమాన పనికి సమాన వేతనం కల్పించాలని విన్నవించారు. ఎమ్మెల్యే స్పందిస్తూ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు ఎం.బుజ్జి, కార్యదర్శి కాకాని అప్పారావు, పల్నాడు జిల్లా కార్యదర్శి సింగంశెట్టి వెంకటేశ్వర్లు, టి.నీలబాబు, సాగర బాబు పాల్గొన్నారు.

మంత్రి లోకేష్‌కు ఎమ్మెల్యే అరవిందబాబు వినతి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా : విద్యా, ఉపాధి అవకాశాలతో పాటు అన్నివిధాలా వెనుకబడిన పల్నాడు జిల్లాను అభివృద్ధి చేయాలని మంత్రి లోకేష్‌ను నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు కోరారు. మంత్రిని గురువారం కలిసిన ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసిపి పాలనలో తీవ్రంగా దెబ్బతిన్న పల్నాడును అభివృద్ధి పథంలో నడిపించాలన్నారు. మానవ వనరుల అభివృద్ధి, ఉద్యోగ, ఉపాధి అవకాశాల విషయంలో పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు.


సత్తెనపల్లి


బెల్లంకొండ


చిలకలూరిపేట

విద్యాసంస్థల బంద్ విజయవంతం

ప్రజాశక్తి-సత్తెనపల్లి

భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ)తోపాటు ఇతర విద్యార్థి సంఘాలు దేశవ్యాప్తంగా చేపట్టిన విద్యాసంస్థల బంద్ పల్నాడు జిల్లాలో జయప్రదంమైంది. ఇందులో భాగంగా సత్తెనపల్లి పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు,కాలేజీలు మూతబడ్డాయి. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ పల్నాడు జిల్లా ఉపాధ్యక్షులు అమూల్య మాట్లాడుతూ అసమర్ధ ఎన్‌టిఎను రద్దు చేయాలని, కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఇటీవల నెట్, నీట్ పరీక్షలు రాసి నష్టపోయిన విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలన్నారు. పిహెచ్‌డి అడ్మిషన్ల కోసం ఇటీవల ఆమోదించిన తప్పనిసరి నెట్ స్కోర్ విధానాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని కోఆరు. విద్యార్థి సంఘాల నేతలపై



అక్రమ కేసులు, నిర్భంధాలు తొలగించి, యూనివర్సిటీల్లో ప్రజాస్వామ్య వాతావరణాన్ని నెలకొల్పాలని డిమాండ్ చేశారు. డివైఎఫ్ఐ నాయకులు జె.రాజ్ కుమార్, ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్షులు సిహెచ్.సత్తిబాబు, నాయకులు షాహిద్, ఇషాంత్, నందు, అంకమ్మరావు, అజయ్, సలీం, షరీఫ్, ఆకాష్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి - బెల్లంకొండ : స్థానిక జూనియర్ కళాశాల, ప్రైవేట్ విద్యాసంస్థలను ఎస్ఎఫ్ఐ నాయకులు బంద్ చేయించారు. నాయకులు చిరంజీవి, మహేష్, స్వామి నాయక్, సిహెచ్ పుల్లారావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - చిలకలూరిపేట : పట్టణంలో విద్యాసంస్థల బంద్ విజయవంతమైంది. తహశీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌కు ఎఐఎస్ఎఫ్ నాయకులు వినతి పత్రం ఇచ్చారు. నాగేశ్వరరావు, పి.గోపీచంద్, జి.జగదీష్, టి.సాహిత్ కుమార్, ఎ.శ్రీనివాసరావు, ఎన్.సాయిశ్రీనాథ్, వి.ప్రశాంత్, బి.భగత్ సింగ్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మాచర్ల : పట్టణంలోని పలు విద్యాసంస్థలు బంద్ పాటించాయి.

ప్రజాశక్తి - వినుకొండ : ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యాసంస్థల బందు నిర్వహించారు. నాయకులు పి.అభిషేక్ మాట్లాడారు. బి.మహేష్, శ్రీరామ్,భాస్కర్, అనిల్, సుభాని పాల్గొన్నారు.

క్వార్జ్ క్రిస్టల్ ఖనిజం అక్రమ తవ్వకం

ప్రజాశక్తి - నకరికల్లు



ఖనిజం కోసం తవ్విన ప్రదేశం.. ఇన్‌సెట్‌లో క్రిస్టల్ ఖనిజం

నరసింగపాడు పంచాయతీ పరిధిలోని పూరిబోడు కొండపై ఉన్న అత్యంత విలువైన క్వార్జ్ క్రిస్టల్ ఖనిజ సంపదను అక్రమార్కులు కొల్లగొడుతున్నారు. కొందరు కలిసి ముఠాగా ఏర్పడి రాత్రికి రాత్రే తవ్వకాలు జరిపి క్రిస్టల్‌ను బయటికి తీస్తున్నారు. ఈ ఖనిజాన్ని గాజు గ్లాసులు, అద్దాల తయారీలో వాడతారు. 97 సర్వే నంబర్‌లో రెవెన్యూ పోరంబోకు పూరిబోడు కొండ 110 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. గత ప్రభుత్వాల హయాంలో కొంతమంది పేదలకు ఇక్కడ ఇళ్ల పట్టాలు ఇచ్చారు. కొంతమంది రైతులు కొండను తొలిచి వ్యవసాయ భూములుగా చేసుకున్నారు. అయితే ఈ ప్రాంతంలో నాణ్యమైన క్రిస్టల్ ఉండడం, దానికి మార్కెట్లో మంచి గిరాకీ ఉండడంతో అక్రమార్కుల కన్ను దీనిపై పడింది. బుధవారం రాత్రి కొంతమంది వ్యక్తులు తవ్వకాలు జరిపి సుమారు రూ.10-15 లక్షల విలువ చేసే ఖనిజాన్ని తరలించినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. ఇంత జరుగుతున్నా మైనింగ్, రెవెన్యూ, పోలీసు అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి.

విద్యుత్ ప్రీపెయిడ్ మీటర్లు వద్దు

మండల సర్వసభ్య సమావేశం ప్రతిపాదన - పలు అంశాలపై తీర్మానాలు

ప్రజాశక్తి - పెదకూరపాడు



సమావేశంలో అధికారులు, ప్రజాప్రతినిధులు

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, వ్యాధుల నివారణ, నియంత్రణకు చర్యలు చేపట్టాలని అధికారులను ఎంపిపి బి.మీరయ్య, ఎంపిడిఒ పి.మల్లీశ్వరి కోరారు. మండల సర్వసభ్య సమావేశం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం జరిగింది. ఈ సందర్భంగా శాఖల వారీగా వారు సమీక్షించారు. విద్యుత్ శాఖలో ప్రీపెయిడ్ మీటర్లను ఉపసంహరించుకోవాలని సమావేశం ఏకగ్రీవంగా ప్రతిపాదన చేసింది. ఐసిడిఎస్ కార్యాలయాన్ని తాళ్లూరులోనే కొనసాగించాలని, పెదకూరపాడులో సామూహిక మరుగుదొడ్లను నిర్మించాలని తీర్మానం చేశారు. కౌలురైతులందరికీ గుర్తింపు కార్డులివ్వాలని ప్రతిపాదించారు. ఉద్యానవన శాఖ అధికారిని రెగ్యులర్‌గా నియమించాలని కోరారు. పాటిబండ్లలో నీరు సరగా సరఫరా కావడం లేదని సమావేశంలో ప్రస్తావించగా పరిష్కారానికి ఎంపిపి ఆదేశించారు. సబ్సిడీపై జొన్నలు అందుబాటులో ఉన్నాయని, గొర్రెలకు వ్యాక్సిన్లు వేస్తామని మండల పశు వైద్యాధికారి శ్రీదేవి తెలిపారు. ఉపాధి హామీ పనుల్లో జిల్లాలోని పెదకూరపాడు మండలం మొదటి స్థానంలో నిలిచినట్లు అధికారులు తెలిపారు. ఈ చట్టం కింద పండ్ల తోటల సాగుకు సబ్సిడీ ఇస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో తహశీల్దార్ ప్రభాకర్‌రావు, ఎంఇఒలు ప్రసాదరావు, సత్యనారాయణ, ఎపిఒ కోటేశ్వరరావు, పెదకూరపాడు సర్పంచ్ రాజు, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



మానికొండ సూర్యావతికి ఐద్వా ఘన నివాళి

ప్రజాశక్తి-సత్తెనపల్లి

మహిళల చట్టాలు, హక్కుల కోసం నిరంతరం పోరాడిన యోధురాలు మానికొండ సూర్యవతి అని భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) పట్టణ కార్యదర్శి గద్దె ఉమశ్రీ అన్నారు. గురువారం స్థానిక పుతుంబాక భవన్‌లో మానికొండ సూర్యావతి వర్ధంతి సభ నిర్వహించారు. ఉమశ్రీ మాట్లాడుతూ మహిళల సమస్యల మీద సూర్యావతి అనేక పోరాటాలు చేసి చాలా చట్టాలు సాధించారని అన్నారు. వరకట్న నిషేధ చట్టం, ఆస్తిహక్కు చట్టం, మద్యపాన నిషేధ చట్టం, అత్యాచార నిరోధక చట్టాలను సాధించారని అన్నారు. ఎమ్మెల్సీగా, మండల అధ్యక్షులుగా ఎన్నికైన సందర్భంలో మరుగు దొడ్ల నిర్మాణానికి కృషి చేశారన్నారు. ఐద్వా జిల్లా కార్యదర్శి జి.రజని మాట్లాడుతూ మహిళల రక్షణ కోసం చట్టాలున్నా సరిగా అమలు కావడం లేదని, పటిష్ట అమలుకు ప్రభుత్వాలు శ్రద్ధ పెట్టాలని డిమాండ్ చేశారు. 33 శాతం రిజర్వేషన్ కోసం జరిగిన పోరాటాలు, వాటిల్లో సూర్యావతి పాత్రను గుర్తు చేశారు. అనంతరం నాయకులు జి.మల్లేశ్వరి, పి.మహేష్ మాట్లాడారు. రమాదేవి, ఆయేషా, స్పందన, సుధ, సుజాత పాల్గొన్నారు.

జైలు నుండి ఓదార్పు యాత్రకు జగన్ శ్రీకారం : ఎమ్మెల్యే పుల్లారావు

ప్రజాశక్తి - చిలకలూరిపేట

ఎన్నికల అనంతరం తొలిసారిగా బయటకు వచ్చిన మాజీ సిఎం జగన్‌మోహన్‌రెడ్డి తన విపరీత మనస్తత్వాన్ని మరోసారి బయటపెట్టుకున్నారని ఎమ్మెల్యే పత్తిపాటి పుల్లారావు విమర్శించారు. ఈ మేరకు స్థానిక తన నివాసంలో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఎన్నిల్లో ఓడిపోయిన తర్వాత జగన్ మొదటిసారి బయటకు వస్తునే జైలుతో తన యాత్రలు ప్రారంభించారని, అదికూడా ఒక డాన్ పరామర్శతో ఓదార్పునకు శ్రీకారం చుట్టారని ఎద్దేవ చేశారు. ఇవిఎంలను పగలగొట్టిన వ్యక్తితో అదేదో ఘనకార్యం చేసినట్లు వ్యవహరించడం సరికాదన్నారు. అధికారం అండతో పల్నాడులో పిన్నెల్లి సోదరులు ఐదేళ్లపాటు చేసిన అవినీతి అక్రమాలు అన్నీ ఇన్ని కావని విమర్శించారు. వాళ్లేదో అమాయక చక్రవర్తులంటూ జగన్ వెనకేసుకురావడం, కేసులు అన్యాయంగా పెట్టారని మాట్లాడ్డం హాస్యాస్పదమన్నారు.

విద్యాసంస్థల బంద్ విజయవంతం

ప్రజాశక్తి - మంగళగిరి

నీట్, నెట్ పరీక్షల్లో జరిగిన అవకతవకలు, పేపర్ లీకేజ్ కు కేంద్ర బిందువు అయిన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీని రద్దు చేయాలని, జీవో నంబర్ 77ను రద్దు చేయాలి, కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలి, డిమాండ్ చేస్తూ దేశ వ్యాప్తంగా విద్యార్థి సంఘాలు ఇచ్చిన పిలుపులో భాగంగా మంగళగిరిలో గురువారం విద్యాసంస్థల బంద్ సంపూర్ణంగా జరిగింది. ముందుగా ఎస్ఎఫ్ఐ, ఎఐఎస్ఎఫ్ నాయకులు, కార్యకర్తలు మంగళగిరి పట్టణంలో యూనివర్సిటీ బస్సులును అడ్డుకోవడంతో బంద్ ప్రారంభించారు. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తూ వివిధ విద్యా సంస్థలను బంద్‌లో పాల్గొని సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు సమీర్ అలీఖాన్, మూలం వెంకట, సాయి, ఇర్ఫాన్, మహమ్మద్, సమీర్, షరీఫ్, సాయి, భాను, రోహిత్, మురళి, ముస్తఫా ఏఐఎస్ఫ నాయకులు శివ, అభి, వెంకట్ పాల్గొన్నారు.


మంగళగిరిలో

ప్రజాశక్తి-తెనాలిరూరల్

నీట్ పరీక్ష ఫలితాలపై సుప్రీంకోర్టు జడ్జితో సమగ్రమైన విచారణ చేపట్టి నీట్ పరీక్షను రద్దుచేసి ఎన్టిఎ సంస్థను రద్దు చేయాలని ఎఐఎస్ఎఫ్ గుంటూరు జిల్లా అధ్యక్షుడు పాశం వెంకటేష్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్త విద్యాసంస్థల బందులో భాగంగా గురువారం తెనాలి నియోజకవర్గంలో వామపక్ష విద్యార్థి సంఘాలు ఎఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ మిగతా విద్యార్థి సంఘాలు కలుపుకొని బంద్ జయప్రదం చేశామన్నారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ విడుదల చేసిన నీట్ పరీక్షా ఫలితాల్లో 720 కి 720 మార్కులు 6 గురికి రావటం వారు హర్యానాకు చెందిన ఒకే సెంటరుకు చెందినవారు కావటం పలు అనుమానాలకు తావిస్తుందని పేర్కొన్నారు. తక్షణమే నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ విడుదల చేసిన ఫలితాల దష్ట్యా మెడికల్ విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఎన్టిఎ తో పాటు రద్దుచేసి అదేవిధంగ నీట్ పరీక్షలను కూడా రద్దు చేయాలని అన్నారు. గత ప్రభుత్వం జిఒ 77 ను తీసుకొచ్చి పిజి విద్యార్థుల భవిష్యత్తుని నాశనం చేసిందని అన్నారు. జిఒ 77 ను రద్దుచేసి విద్యార్థుల భవిష్యత్తుని కాపాడలన్నారు. విద్యార్థి నాయకులపై అక్రమంగా బనాయించిన కేసులను కొట్టేయాలని డిమాండ్ చేశారు. బంద్‌కు సహకరించిన విద్యార్థులందరికీ అభినందనలు తెలియజేశారు. జిల్లా నాయకులు మద్దినేని కిరణ్ బాబు మాట్లాడుతూ నీట్ పరీక్ష పేపర్ లీకేజ్ అయిందని పెద్ద ఎత్తున ఆందోళన జరుగుతున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడం శోచనీయమన్నారు. వెంటనే కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయాలని పేర్కొన్నారు. రాష్ట్రాల స్వయం ప్రతిపత్తిని దెబ్బతీసే నీట్ పరీక్షను రద్దు చేయాలని దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రులు విన్నవిస్తున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా వేలాదిమంది విద్యార్థుల జీవితాలు మెడికల్ విద్యకు దూరమవు తున్నారన్నారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించి నీట్ పరీక్ష పేపర్ రద్దుకు కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయాలని కోరారు. ఎస్ఎఫ్ఐ తెనాలి కార్యదర్శి అభిలాశ్ మాట్లాడుతూ తెనాలి నియోజకవర్గంలో కూడా విద్యార్థులు అనేక సమస్యలతో ఇబ్బంది పడుతున్నారని అన్నారు. తెనాలి పరిసర ప్రాంతాలకు సంబంధించి ఒక పాలిటెక్నిక్ కాలేజీ ఏర్పాటు చేస్తే ఎంతోమంది విద్యార్థులకు ఉపయోగపడుతుందని తెలియజేశారు. కార్యక్రమంలో తెనాలి పట్టణ ఎఐఎస్ఎఫ్ అధ్యక్షుడు గండు శివ, వైస్ ప్రెసిడెంట్ భూమేష్, నాయకులు, పాశం వినయ్, గౌతమ్, చక్రి, తలతోటి శ్రీను, దినేష్, ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్షుడు వసంత్, నాయకులు శశికాంత్, భాను వెంకట సాయి, ధల్మన్, ఫహీం తదితర విద్యార్థి సంఘ నాయకులు విద్యార్థులు పాల్గొన్నారు.


తెనాలిలో




పెదనందిపాడులో


తుళ్లూరులో


పొన్నూరులో

ప్రజాశక్తి - ఎఎన్‌యు

అసమర్ధ ఎన్డిఏ ను రద్దు చేయాలని, కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయాలని, కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న పరీక్షలను రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగించాలని, నీట్ పరీక్షలలో జరిగిన అవకతవకలను నిగ్గు తేల్చాలని కోరుతూ యూనివర్సిటీ ఎస్ ఎఫ్ ఐ, ఏ ఐ ఎస్ ఎఫ్ కమిటి ఆధ్వర్యంలో బంద్‌ను సంపూర్ణంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యురాలు నవిత యూనివర్సిటీ అధ్యక్షుడు సంతోష్, అజయ్, రాజేష్ ఏఐఎస్ఎఫ్ యూనివర్సిటీ అధ్యక్షులు నాశరయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పెదనందిపాడు రూరల్

దేశవ్యాప్తంగా విద్యాసంస్థల బంద్ కార్యక్రమంలో భాగంగా పెదనందిపాడులో ఎస్ఎఫ్ఐ మండల నాయకులు జి అభిలాష్ ఆధ్వర్యంలో విద్యాసంస్థల బంద్ విజయవంతంగా జరిగింది. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు బి అభి. వంశీ .గోపి .భాగ్యరాజు పలువురు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పొన్నూరు

పొన్నూరుపట్టణంలో విద్యాసంస్థల బంద్ జయప్రదంగా జరిగిందని ఎస్ఎఫ్ఐ నాయకులు ఎస్కె జాహిద్ తెలిపారు. నీట్ పరీక్ష లో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ చేపట్టి నిందితులను కఠినంగా శిక్షించాలని అన్నారు. జీవో నెంబర్ 77 నీ వెంటనే రద్దు చేయాలని, ప్రభుత్వ పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు అందించాన్నారు. టీచర్ పోస్టుల ఖాళీ లను తాత్కాలిక పద్ధతిలో భర్తీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు జమీర్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మహిళా ఉద్యమ నేత మానికొండ సూర్యావతికి ఘన నివాళి

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్, తాడేపల్లి

దోపిడీ పీడల్లేని సమాజం కోసం జీవితాంతం పని చేసిన, మహిళలు ఎదుర్కొంటున్న అనేక సమస్యల పైన కృషిచేసిన ఉత్తమ ప్రజాప్రతినిధి మానికొండ సూర్యావతి ధన్యురాలని ఐద్వా నాయకులు దొంతిరెడ్డి శ్రీనివాసకుమారి అన్నారు. గురువారం తాడేపల్లి పట్టణంలోని సుందరయ్యనగర్ లీలా సుందరయ్య కళావేదిక వద్ద మహిళా సంఘం పట్టణ కార్యదర్శి గిరిజ అధ్యక్షతన, ఎంటిఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం జాతీయ రహదారి వద్ద ఉన్న కేబీ భవన్ లో నాయకులు కె సరోజిని అధ్యక్షతన నిర్వహించిన మానికొండ సూర్యావతి వర్ధంతి సభల్లో శ్రీనివాసకుమారి ప్రధాన వక్తగా ప్రసంగించారు. మహిళలు ఇంట్లో నుంచి బయటకు రావడానికి వీల్లేని పరిస్థితుల్లో వారి సమస్యలను పరిష్కరించాలని సూర్యావతి పోరాడారని తెలిపారు. ప్రజా సమస్యల పైన నందమూరు సర్పంచ్ గాను, ఉంగుటూరు మండల అధ్యక్షురాలు గాను, ఎం ఎల్ సి గా విశేషమైన సేవలు ప్రజలకు అందించడంలో ఆమె ముందుండేవారిని అన్నారు. అంతేకాకుండా భూస్వామి కుటుంబంలో జన్మించినప్పటికీ అట్టడుగు వర్గాల పేదలు, మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల పై కషి చేయడమే కాక సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు అలుపెరగని పోరాటం చేసే వారని ఆమె అన్నారు. ఉంగుటూరు మండలంలో 18 వ్యక్తిగత మరుగుదొడ్లను నిర్మించి ఆనాడు జిల్లా కలెక్టర్ తో ఉత్తమ ప్రజాప్రతినిధిగా ప్రశంసలు పొందారని అన్నారు. కొందరికి పదవి అలంకారం అయితే ఆ పదవులను కూడా ప్రజాసేవకు ఎలా వినియోగించాలో సూర్యావతి చేసి చూపించారని చెప్పారు. రాజకీయ వ్యతిరేకులు సైతం అభిమానించే విధంగా ఆమె జీవితం కొనసాగిందని తెలిపారు. మహిళలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై సూర్యావతి స్ఫూర్తితో పని చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. అనంతరం ఇటీవల చైనాను సందర్శించిన ప్రజాశక్తి బుక్‌హౌస్ ఎడిటర్ ఎస్.వెంకట్రావు అక్కడ కొనసాగుతున్న సోషలిజం, దాని విశిష్టత, అభివృద్ధి గురించి వివరించారు. ముందుగా సూర్యావతి చిత్రపటానికి నాయకులు నివాళులర్పించారు. లీలా సుందరయ్యనగర్‌లో నిర్వహించిన సభలో కొట్టె విజయలక్ష్మి నాయకులు జ్యోతి, కె.మేరి, ఉష, విజయ, వసుంధర, శ్రీలక్ష్మి, సిపిఎం నాయకులు కొట్టె కరుణాకరరావు, ఎం.నాగేశ్వరరావు, రామారావు, సత్యం తదితరులు పాల్గొన్నారు. సభకు ముందు పిఎన్ఎం రాష్ట్ర నాయకులు జగన్ పలు గీతాలు ఆలపించారు. కెబి భవన్‌లో నిర్యక్రమంలో మహిళా నాయకురాలు జి అమలా శ్రీ, శ్రీదేవి, కృష్ణ తులసి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న శ్రీనివాసకుమారి





నిరసన తెలుపుతున్న ఆటో డ్రైవర్లు,నాయకులు

మంగళగిరిలో ఆటో డ్రైవర్ల నిరసన

ప్రజాశక్తి - మంగళగిరి

జులై 1వ తేదీ నుండి అమలులో వచ్చిన మొటారు వాహన చట్టాలు రద్దు చేయాలని కోరుతూ మంగళగిరి ఎయిమ్స్ ఆటో స్టాండ్ వద్ద సిఐటియు ఆధ్వర్యంలో గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు నన్నపనేని శివాజీ మాట్లాడుతూ ఇటీవల కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన మోటారు వాహనాల చట్టాన్ని రద్దు చేయాలని అన్నారు. డ్రైవర్ల పై భారీ మొత్తంలో పెనాల్టీలు వేసే జి.ఓ నెం.21 ని, అదేవిధంగా జైలు శిక్షలు, లక్షలలో జరిమానాలు విధించాలని తీసుకువచ్చిన న్యాయ సంహిత బిఎస్ఎన్ చట్టం సెక్షన్ 106(1),(2)రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ కార్యదర్శి ఎం బాలాజీ, నాయకులు రాజ రమేష్, కాజా సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వై నేతాజీ



10న ఆలిండియా డిమాండ్స్‌డేను జయద్రం చేయండి

ప్రజాశక్తి-తెనాలిరూరల్

అఖిల భారత కోర్కెల దినోత్సవాన్ని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై నేతాజి పిలుపునిచ్చారు. తెనాలి చెంచుపేట సిఐటియు కార్యాలయంలో గురువారం అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పేర్స్ యూనియన్ విస్తృత సమావేశంలో ఆయన ప్రసంగించారు. సమావేశానికి యూనియన్ జిల్లా ప్రెసిడెంట్ ఎవిఎన్ కుమారి అధ్యక్షత వహించారు. నేతాజి మాట్లాడుతూ సిఐటియు ఆల్ ఇండియా జనరల్ కౌన్సిల్ పిలుపు మేరకు దేశవ్యాప్తంగా ప్రతి ఏడాది యూనియన్ కోర్కెల దినోత్సవాన్ని పాటిస్తుందన్నారు. తెనాలి ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో టీచర్లు, ఆయాలు అందరూ పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. అంగన్వాడిలను వర్కర్స్‌గా గుర్తించాలన్న సిఐటియు డిమాండ్లను ప్రభుత్వాలు పెడచెవిన పెడుతున్నాయని అన్నారు. అంగన్వాడీల కనీస వేతనం నెలకు రూ 26 వేలకు పెంచాలన్నారు. ఇతర కార్మిక చట్టాల్లా వారికి గ్రాట్యుటీ, ఈపిఎఫ్, ఈఎస్ఐ, పెన్షన్ సౌకర్యాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాలు మారిన అంగన్వాడీలపై దాడులు జరగడం హేయమైన చర్య అన్నారు. పలుచోట్ల అంగన్వాడీల విధులకు ఆటంకం కలిగిస్తు వారిని భయ భ్రాంతులకు గురి చేస్తున్నారని అన్నారు. ఇలాంటి అప్రజాస్వామిక చర్యలను మాను కోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు కొల్లిపర బాబు ప్రసాద్, షేక్ హుస్సేన్ వలి, పి పావని, టి అనూరాధ, జి లావణ్య,షేక్ హసీనా బేగం, షేక్ ఆసీఫ్ బేగం, బి రాజకుమారి, పి, విజయలక్ష్మి, ఎస్ కనక దుర్గ, ఎన్ సుజాత, ఎన్ పుష్ప, షేక్ గౌసియా బేగం, వై సువర్ణలత తదితరులు పాల్గొన్నారు.

వృద్ధునికి వినికిడి యంత్రం అందజేసిన కలెక్టర్

ప్రజాశక్తి-గుంటూరు : ఇటీవల జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి చేబ్రోలు మండలంలో పర్యటన సందర్భంగా చేబ్రోలు పిహెచ్‌సి వద్ద తనకు వినికిడి యంత్రం ఇప్పించాలని కోరిన 68 ఏళ్ల వృద్ధుడు షేక్.చిన కాలేషాకు జిల్లా కలెక్టర్ గురువారం తనచాంబర్‌లో యంత్రాన్ని అందజేశారు. వినికిడి లోపంతో బాధపడు తున్నా నని, తనకు వినికిడి యంత్రం ఇప్పించా లని కోరాడు. దీంతో కలెక్టర్ స్పందించి కాలేషాకు జిజిహెచ్‌లో పరీక్ష చేయించి, సంబంధిత దివ్యాంగుల శాఖ ద్వారా వినికిడి యంత్రం మంజూరు చేయించి, అందజేశారు.


యంత్రం అందచేస్తున్న కలెక్టర్

మాచర్ల మారణహోమంలో జగన్ పాత్ర ఉందని అనుమానం : ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి

ప్రజాశక్తి - మాచర్ల

వైసిపిని రాష్ట్ర ప్రజలు 11 సీట్లకు పరిమితం చేసినా జగన్‌మోహన్‌రెడ్డి ఇంకా అసత్య ప్రచారాలు మానుకోలేదని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. నెల్లూరు జైలులో మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామక్రిష్ణారెడ్డిని జగన్‌మోహన్‌రెడ్డి పరామర్శించడంపై బ్రహ్మారెడ్డి విలేకర్లతో మాట్లాడారు. పిన్నెల్లి రామక్రిష్ణారెడ్డి ఈవీఎంను ధ్వంసం చేయడం, అడ్డుకోబోయిన వ్యక్తిని తీవ్రంగా గాయపర్చి హత్య చేయబోవటం, ప్రశ్నించిన మరో మహిళను తిట్టి, బెదిరించడం వంటివి జగన్‌కు కనిపించలేదా? అని ప్రశ్నించారు. మాచర్ల నియోజకవర్గంలో మారణహోమం జరిగితే నాడు సిఎంగా ఉన్న జగన్‌మోహన్‌రెడ్డి మానవత్వంతో స్పందించలేదన్నారు. మాచర్లలో జరిగిన మారణహోమంలో జగన్ పాత్ర కూడ ఉందనే అనుమానాలు ఉన్నాయన్నారు. పోలీసు శాఖలోని ఓ ఉన్నాతాధికారి ద్వారా పిన్నెల్లి సోదరులు పరారయ్యారని వార్తలకు నేటి జగన్‌మోహన్‌రెడ్డి పరామర్శకు బలం చేకూరుతోందన్నారు. ఈ పరామర్శ రిమాండ్‌లో ఉన్న ఖైదీని బెయిల్‌పై తిరుగుతున్న ఓ రిమాండ్ ఖైదీ పరస్పరం ఓదార్చుకున్నట్లు ఉందని ఎద్దేవ చేశారు. వైసిపి ప్రభుత్వంలో సోషల్ మీడియాలో పోస్టులు పెడితేనే అర్ధరాత్రులు అరెస్టు చేసిన ఘటనలను గుర్తు చేశారు. రామకృష్ణారెడ్డి సోదరుడు వెంకటరామిరెడ్డి ఇంకా అరెస్టు కాకపోవడానికి కారణం ఆయన జగన్ ప్యాలెస్‌లో భద్రంగా దాక్కోవడం వల్లేననే అనుమానం ప్రజల్లో ఉన్నాయన్నారు. దీనిపై జగన్‌ను పోలీసు ఉన్నతాధికారులు విచారణ చేయాలని కోరారు.



తరగతి గదిలో బోధిస్తున్న డిప్యూటీ డీఈఓ వేణుగోపాల్

విద్యా సామర్థ్యాలు మెరుగుపడాలి

ప్రజాశక్తి-ఈపూరు

విద్యార్థులకు నాణ్యమైన విద్యను బోధించడం ద్వారా వారిలో విద్యా సామర్థ్యాలను మెరుగుపరచవచ్చని నరసరావుపేట డిప్యూటీ వేణుగోపాల్ అన్నారు. మండలంలోని ఎ.ముప్పాళ్ల జెడ్‌పి పాఠశాలను ఆయన గురువారం సందర్శించారు. మౌలిక సదుపాయాలను పరిశీలించారు. ఆరవ తరగతి గదిలో గ్రీన్ బోర్డుపై పదాలను రాసి వారి ప్రాథమిక స్థాయి నైపుణ్యాలను పరీక్షించారు. ఉపాధ్యాయులతో సమీక్షించి వెనకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని చెప్పారు. ప్రధానోపాధ్యాయులు సాంబ నాయక్, వ్యాయామ ఉపాధ్యాయులు చిరంజీవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నోటు పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి-ఈపూరు

మండల కేంద్రమైన ఈపూరు బీసీ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో 105 మంది విద్యార్థులకు గ్రామ టిడిపి నాయకులు మద్ధం వెంకట్రావు, ముద్దా నాగలక్ష్మయ్య, మద్ధం తాతయ్య ఉచితంగా నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.











నరసరావుపేటలో నివాళులర్పిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ లత్కర్, జెసి శ్యాప్రసాద్, ఎస్పీ మలికగర్గ్ తదితరులు.. సత్తెనపల్లిలో ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ నివాళి, వినుకొండలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జీవీ

అల్లూరి సీతారామరాజును ఆదర్శంగా తీసుకోవాలి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు 127వ జయంతి సందర్భంగా జిల్లా వ్యాప్తంగా గురువారం నివాళులర్పించారు. సీతారామరాజు చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలేశారు. ఇందులో భాగంగా పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట కలెక్టరేట్‌లో, జిల్లా పోలీసు కార్యాలయంలో చిత్ర పటాలకు జిల్లా కలెక్టర్ శ్రీకేశ్ బి లత్కర్, ఎస్పీ మలికగర్గ్ పూలమాలలేశారు. కలెక్టర్, ఎస్పీ మాట్లాడుతూ బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా సీతారామరాజు సాయుధ పోరాటం చేసిన వీరుడని, ఆయన ధైర్యసాహసాలు, దేశభక్తి నేటికీ ఎందరికో ఆదర్శంగా నిలుస్తాయని చెప్పారు. ఆయన పోరాట స్ఫూర్తిని, జాతీయ భావాన్ని యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. జాయింట్ కలెక్టర్ ఏ.శ్యాం ప్రసాద్, డిఆర్ఓ కె.వినాయకం, అదనపు ఎస్పీ (అడ్మిన్) ఆర్.రాఘవేంద్ర పాల్గొన్నారు.

ప్రజాశక్తి - వినుకొండ : మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ టి.కృష్ణవేణి అధ్యక్షతన సీతారామరాజు జయంతి జరిపారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు హాజరై మాట్లాడారు. మున్సిపల్ చైర్మన్ డాక్టర్ దస్తగిరి, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు. టిడిపి కార్యాలయంలో చిత్రపటానికి జీవీ ఆంజనేయులు, మల్లికార్జునరావు పూలమాలలేశారు.

ప్రజాశక్తి-సత్తెనపల్లి : బ్రిటిష్ దొరలకు వ్యతిరేకంగా పోరాడి దేశం కోసం ప్రాణాలర్పించిన గొప్ప మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు అని సిఐటియు నాయకులు పెండ్యాల మహేష్ అన్నారు. డివైఎఫ్ఐ నాయకులు జె.రాజ్ కుమార్ అధ్యక్షతన నిర్వహించిన సభలో మహేష్ మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా సాయుధ పోరాటం నడిపిన గొప్ప వీరుడన్నారు. డివైఎఫ్ఐ మాజీ నాయకులు జి.బాలకృష్ణ మాట్లాడుతూ బ్రిటిష్ పాలకులు అటవీ సంపదంతా దోచుకుపోతుంటే ఇది మన అటవీ సంపద మనకే దక్కాలని ఆ ప్రాంతంలోనే యువకుల్ని చైతన్యపరిచిన గొప్ప వ్యక్తి సీతారామరాజు అని కొనియాడారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు డి.అమూల్య, సభ్యులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి సత్తెనపల్లి టౌన్ : స్వామి వివేకానంద చైతన్య భారతి సంస్థ ఆధ్వర్యంలో రైల్వే స్టేషన్ రోడ్డులో ఏర్పాటు చేసిన విగ్రహాన్ని టిడిపి నాయకులు కన్నా నాగరాజు ఆవిష్కరించి మాట్లాడారు. సంస్థ అధ్యక్షులు డాక్టర్ జి.శ్రీధర్, సభ్యులు జెపిఎస్ శాస్త్రి సజ్జాపురం స్వామి, గౌరవాధ్యక్షులు పి.సాంబశివరావు, యోగ సాధకులు వెంకటేశ్వరావు, కోశాధికారి టి.సత్యనారాయణ, ఎంవి సుబ్బారెడ్డి, రత్తయ్య, ఏడుకొండలు, ఎ.సత్యనారాయణ, మున్సిపల్ కమిషనర్ షమ్మీ పాల్గొన్నారు.

ప్రజాశక్తి - చిలకలూరిపేట : గిరిజన హక్కుల కోసమే కాకుండా దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడి 27 ఏళ్లకే ప్రాణ త్యాగం చేసిన విప్లవ జ్యోతి అల్లూరి సీతారామరాజు అని ఏపీ గిరిజన సంఘ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు బి.శ్రీనునాయక్ అన్నారు. స్థానిక ఎన్నార్టీ సెంటర్లోని సీతారామరాజు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కె.నాగేశ్వరరావు, బి.చిన్న నాయక్, బి.రాంబాబు నాయక్, కె.నాగేశ్వరరావు, టి.వెంకట నగేష్, ఎస్.లెనిన్ బాబు, ఎస్.నాగరాజు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మాచర్ల : త్యాగధనులైన నాటి దేశ నేతలను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ డి.వెంకటదాసు అన్నారు. స్వామి వివేకానంద విగ్రహం దగ్గర స్వామి వివేకానంద 123వ వర్ధంతి, అల్లూరి సీతారామారాజు 127వ జయంతి, పింగళి వెంకయ్య 162వ వర్ధంతి నిర్వహించారు. వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎం.గోవిందరెడ్డి, పి.పుల్లారావు, షేక్ చినలాల్‌సాహెబ్, రామచంద్రరావు, రామయ్య పాల్గొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ సరోజనిదేవి, విస్తరణాధికారి కోటేశ్వరరావు, తాళ్ళపల్లి సర్పంచి పి.బ్రహ్మానాయడు తదితరులు సీతారామరాజుకు నివాళులర్పించారు.

ప్రజాశక్తి పెదకూరపాడు : మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు ఆశయాలును విద్యార్థులు, యువత ఆదర్శంగా తీసుకోవాలని తహశీల్దార్ ప్రభాకర్‌రావు, ఎంపిడిఓ మల్లేశ్వరి, పెదకూరపాడు జెడ్‌పి పాఠశాల హెచ్‌ఎం కె.వెంకటరమణ అన్నారు. పలు కార్యాలయాల్లో సీతారామరాజు జయంతి నిర్వహించారు.

దంతాల ఆరోగ్య పరిరక్షణలో అప్రమత్త అవసరం

డాక్టర్ అనిల్ కుమార్ కట్టా, వైష్ణవి దాసరి

ప్రజాశక్తి - చిలకలూరిపేట



నవ్వు ముఖానికి దంతాలు అందాన్ని రెట్టింపు చేస్తాయని, అటువంటి దంతాల పరిరక్షణలో ప్రతి ఒక్కరు చాలా అప్రమత్తంగా ఉండాలని స్మైల్ దంత వైద్యశాల వైద్యులు అనిల్‌కుమార్ కట్టా అన్నారు. కొందరు దంతాలను శుభ్రం చేసుకునే క్రమంలో చిన్నచిన్న పొరపాట్లతో నోటి దుర్వాసన వస్తుందని, అటువంటి వారు నలుగురిలో దూరంగా ఉండి మాట్లాడుతూ చులకన అవుతుంటారని అన్నారు. అది లేకుండా ఉండాలంటే దంతాల సంరక్షణలో అప్రమత్తత, జాగ్రత్తలు అవసరమని చెప్పారు. ప్రతి ఒక్కరూ తినే ప్రతి ఆహార పదార్థాన్ని నోట్లో పై పళ్ళు, కింద పళ్ల కింద సమానంగా వీలైనంత ఎక్కువసార్లు నమిలి తినాలన్నారు. తప్పనిసరిగా మృదువైన బ్రష్‌లనే వాడాలని సూచించారు. మధ్యాహ్నం, సాయంత్ర సమయాల్లో బ్రష్ చేయాలని చెప్పారు. బ్రష్ గట్టిగా ఉంటే పళ్లపై ఉండే అనామిల్ పెయింట్ పోతుందని తెలిపారు. అభివృద్ధి చెందిన దేశాల్లో ప్రతి 500 మందికి ఒక దంత వైద్యుడు ఉన్నారని, మన దేశంలో 10 వేల మందికి ఒకరున్నారని తెలిపారు. ప్రస్తుతం దంత సంరక్షణా మనిషి జీవన విధానంలో ముఖ్యమైందని చెప్పారు. ప్రతిరోజూ ఉదయాన్నే గోరువెచ్చని నీటిలో ఉప్పు వేసుకొని పుక్కిలిస్తే అనేక సమస్యలు పరిష్కారం అవుతాయని చెప్పారు. ఇలా చేయడం ద్వారా చిగుళ్ల నుండి రక్తం కారకుండా నివారించొచ్చని, పిప్పి పళ్లు రాకుండా చూసుకోవచ్చని, నోటి దుర్వాసనా రాదని వివరించారు. శీతల పానియాలను వీలైనంత వరకు తీసుకోపోవడం మంచిదన్నారు. పొగాకు పదార్థాలను తినొద్దన్నారు. దంతాలకు సంబంధించి ఏ చిన్న సమస్య ఉన్నా వైద్యులను సంప్రదించడం మంచిదని సూచించారు.

డయేరియా నివారణపై అవగాహన

ప్రజాశక్తి - వినుకొండ : మండలంలోని వెంకుపాలెంలోని మండల పరిషత్ పాఠశాల అంగన్వాడీ కేంద్రం, ఎస్సీ కాలనీ, మెయిన్ బజార్ చెట్టు వద్ద డయేరియా నివారణపై గురువారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. చేతులు శుభ్రం చేసుకునే విధానాన్ని ఎఎన్‌ఎం రమాదేవి, కె.ప్రశాంతి వివరించారు. తాగునీటి నాణ్యత గురించి చెప్పారు. మండల రిసోర్స్ కో-ఆర్డినేటర్ పి.ప్రభాకర్‌రావు మాట్లాడుతూ నీటిని కాచి చల్లార్చి తాగాలన్నారు. పరిసర ప్రాంతాల్లో నిరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, నీటి నిల్వలు దోమల ఉధృతికి అవకాశం ఇస్తాయని చెప్పారు. ఆహార పదార్థాలపై తప్పకుండా మూతలు పెట్టాలన్నారు, భోజనం చేస్తున్నప్పుడు ఈగలు వాలకుండా జాగ్రత్తపడాలన్నారు. నిల్వ ఉన్న ఆహార పదార్థాలను తినొద్దని సూచించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ గుడిపాటి మునెమ్మ, పాఠశాల హెచ్‌ఎం ఎం.సరళ, టీచర్ జె.దేవసేన, అంగన్వాడి వర్కర్ ఎవి.పద్మ, ఎ.చిన్న వెంకటేశ్వర్లు, జి.కృష్ణ, ఆశా వర్కర్స్ రమాదేవి, రూతు, సిహెచ్‌ఓ కె.ప్రశాంతి పాల్గొన్నారు.



ఉద్యోగుల తీరు మారకుంటే ఉపేక్షించం : ఎమ్మెల్యే అరవిందబాబు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ప్రభుత్వ ఉద్యోగం అంటేనే బాధ్యతని, కష్టపడి ఉద్యోగాలు సాధించిన వారు విధి నిర్వహణలో నిర్లక్ష్యం చూపి ప్రజలకు తప్పుడు అభిప్రాయం కలిగించవద్దని సచివాలయం సిబ్బందికి నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు సూచించారు. సచివాలయ సిబ్బందితో పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణం ప్రకాష్ నగర్‌లోని భువనచంద్ర టౌన్‌హాలులో గురువారం సమావేశమయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాజకీయ నాయకులు ఎంతటి నిర్ణయాలు తీసుకున్నా వాటిని సమర్ధంగా అమలు చేయాల్సింది ప్రభుత్వ ఉద్యోగులేనన్నారు. సచివాలయంలో అందుబాటులో ఉండకపోవడం, వేలి ముద్ర వేసి వెళ్లిపోవడం వంటి కారణాలతో ఏదో ఒక పని మీద వచ్చే ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు వరుసగా ఫిర్యాదులొస్తున్నాయని, వీటికి అవకాశం ఇవ్వొద్దని చెప్పారు. ఇప్పటి వరకు సమయానికి వచ్చినా, రాకపోయినా ఎవరూ పట్టించుకోలేదని ఇకపై ఉపేక్షించబోమని స్పష్టం చేశారు.

కాల్వల తీరుపై ఆగ్రహం

మేజర్ కాల్వల మరమ్మతులకు ఎన్ఎస్‌పి అధికారులు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు. నరసరావుపేట మండల పరిధిలోని ఇక్కుర్తి మేజర్ కాల్వను గురువారం పరిశీలించి కాల్వలో తూడు, గడ్డి, పిచ్చి మొక్కలు పెరిగినా తొలగించకపోవడం గమనించారు. ఐదేళ్లుగా ఈ పరిస్థితి నెలకొన్నా గత ప్రభుత్వం, అధికారులు పట్టించుకోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. త్వరితగతిన మరమ్మతులు చేపట్టి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. కార్యక్రమాల్లో మున్సిపల్ కమిషనర్ సి.రవిచంద్రారెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ నాగసరపు సుబ్బరాయగుప్తా, ఇరిగేషన్ డిఇ ఉమ, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ బి.పేరయ్య, మాజీ సర్పంచ్ కె.వెంకటేశ్వర్లు, కె.శ్రీను పాల్గొన్నారు.



రైతులు, ఎన్ఎస్‌పి అధికారులతో కలిసి పంట కాల్వలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు

డివైడర్‌లో మార్పులు చేసి నడకదారులు వదలాలి

నూతన ప్రభుత్వానికి స్థానికుల వినతి

ప్రజాశక్తి మంగళగిరి

మంగళగిరి పట్టణంలో గత ప్రభుత్వ హయాంలో గౌతమ బుద్ధ రోడ్డును విస్తరించి డివైడర్ నిర్మాణం జరిపారు. ఆర్ అండ్ బి బంగ్లా నుండి ఎన్ఆర్ఐ వైద్యశాల వరకు ఈ నిర్మాణం చేపట్టారు. అంబేద్కర్ విగ్రహం వద్ద నుండి బంగ్లా వరకు ఒక్కచోట కూడా నడక దారి లేదు. కొత్తపేట నుండి రైల్వే స్టేషన్‌కు చేరుకునే వారు ఈద్గా మసీదుకు వెళ్లేవారు ఇబ్బందులు పడుతున్నారు. అదే విధంగా వైదేహి కళ్యాణ మండపం నుండి ఎర్ర చెరువు వరకు నడకదారిని వదలలేదు. దీనివలన. వివిధ అవసరా లపై తిరిగే ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈద్గా మసీదు, గోపాలకృష్ణ థియేటర్ ప్రాంతాల్లో నడకదారులు వదలాలని ఆయా ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు. ఎర్ర చెరువు వద్ద ప్రమాద కూడలిగా పేర్కొంటూ గతంలో ఇక్కడ డివైడర్‌తో రహదారిని మూసివేశారు. గోపాలకృష్ణ థియేటర్ సెంటర్లో డివైడర్‌ను మూసివేసి నాలుగు రోడ్ల కూడలిగా ఉన్న ఎర్ర చెరువు ఏరియా వద్ద ఓపెన్ చేయ డంతో ప్రమాదాలు జరుగుతున్నాయని అంటున్నారు. ఎర్ర చెరువు వద్ద మూసివేసి గోపాలకృష్ణ థియేటర్ సెంటర్లో వాహనాల యూటర్న్‌కు మార్గాన్ని వదిలితే ఎంతో సౌలభ్యంగా ఉంటుందని ప్రమాదాలు కూడా తగ్గుతాయని పలువురు సూచిస్తున్నారు. గోపాలకృష్ణ థియేటర్ పక్క వీధిలో ఉన్న వైద్యశాలకు వచ్చి వెళ్లాలన్న ఇక్కడ ఉన్న పెట్రోల్ బంక్‌కు వెళ్లడానికి ప్రయోజనంగా ఉంటుందని అంటున్నారు. కొత్తపేట ఈద్గా వద్ద వాహనాల యూటర్న్ కు అవకాశం కల్పిస్తే కొత్తపేట నుండి రైల్వే స్టేషన్‌కు సమీపంలో ఉన్న రెండు ప్రైవేటు ఆసుపత్రులకు మసీదుకు వెళ్లే వారికి ప్రయోజనంగా ఉంటుంది వెళ్లే వారికి ప్రయోజనంగా ఉంటుంది.



మంగళగిరి పట్టణంలో నిర్మించిన డివైడర్

స్పీడ్ బ్రేకర్లూ నిర్మించాలి

ప్రస్తుతం రోడ్డు ప్రమాదాలు పెరిగిపోయాయి. రహ దారి నిర్మాణం తర్వాత ప్రమాదాల తీవ్రత ఎక్కువైంది. ప్రధాన కూడళ్లలో వేగ నియంత్రణ బోర్డులను ఏర్పాటు చేయలేదు. మలుపుల వద్ద బోర్డులు కూడా ఏర్పాటు చేయలేదు. దీనివల్ల రోజు ఏదో ఒక ప్రమాదం చోటు చేసుకుంటోంది. అన్ని శాఖల అధికారుల సూచనల మేరకు ప్లాస్టిక్ స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేస్తే వాహనాల వేగానికి కొంతైనా అడ్డుకట్ట వేయాలి. పలుచోట్ల డివైడర్ లో మార్పులు చేసి విజయవాడ తరహాలో మలుపుల వద్ద బోర్డులను ఏర్పాటు చేయాల్సి ఉంది. ఆయా చర్యలకు ఉపక్రమిస్తే ప్రజలకు సౌలభ్యంగా ఉండటంతో పాటు ప్రమాదాలను నివారించవచ్చు అని పలువురు సూచిస్తున్నారు. అంబేద్కర్ కూడలిలో సర్కిల్‌ను ఏర్పాటు చేసి మధ్యలో వాటర్ ఫౌంటెన్‌ను నెలకొల్పితే ఈ ప్రాంతానికి కొత్త రూపు వచ్చే అవకాశం ఉంది.



వెద పద్ధతిలో సాగుకు రైతులు సన్నద్ధం

ప్రజా శక్తి దుగ్గిరాల

సకాలంలో వర్షాలు కురవడంతో రైతన్నలు మండల వ్యాప్తంగా గురువారం వెద పద్ధతి ద్వారా విత్తనాలు చల్లే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. భూములు తడిసి దుక్కులకు అనుకూలిస్తున్నాయని రైతులు తెలిపారు. మండలంలోని పెనుమూలి ఈ మని గ్రామాల పరిసర ప్రాంతాలలో ట్రాక్టర్ల రణగుణ ధనులతో పొలాలు హెూ రెత్తిపోతున్నాయి .గత సంవత్సరం ఖరీఫ్‌లో మిచౌంగ్ తుపానుకు వరిచేలు దెబ్బతిన్నప్పటికీ రబిలో మొక్కజొన్న జొన్న పంటలకు ధరలు ఆశాజనకంగా ఉండటంతో రైతులు ఉత్సాహంగా ఈ సంవత్సరం ఖరీఫ్‌కు శ్రీకారం చుట్టారు. బిపిటి 5204 రకం వరి వంగడాలు అధికంగా సాగు చేపట్టగా ఎంటియు 1262 రకం విత్తనాలు రెండో స్థానాన్ని ఆక్రమిస్తున్నాయి. మండల వ్యాప్తంగా ఉన్న దాదాపు 22 వేల ఎకరాలలో సుమారు 20వేల ఎకరాలు వెద పద్ధతి ద్వారా విత్తనాలు చల్లుతుండగా 2000 ఎకరాలు నాట్లు వేసే పద్ధతిన సాగు చేయనున్నారు.

గుర్తింపు కార్డులపై కౌలు రైతులకు అవగాహన

ప్రజాశక్తి - తుళ్లూరు

కౌలు రైతులకు గుర్తింపు కార్డుల మంజూరుపై మండల పరిధిలోని పెదపరిమిలో గురువారం అవగా హనా కార్యక్రమం నిర్వహించారు. రెవెన్యూ, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యాల యంలో జరిగిన కార్యక్రమంలో వ్యవసాయాధికారి కె శ్రీరంజని కౌలు గుర్తింపు కార్డులు పొందేందుకు రైతులు ఏం చేయాలనే దానిపై అవగాహన కల్పించారు. పొలం లేకుండా కౌలుకు పంట సాగు చేసేవాళ్ళు, కొంత సొంత పొలం ఉన్నప్పటికీ మరి కొంత పొలాన్ని కౌలుకు తీసుకొని సాగు చేసేవాళ్ళు, పంట సాగు దారుల హక్కుల కార్డు (సిసి ఆర్‌సి) కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సిసిఆర్‌సి కార్డుల వల్ల పంట నమోదుతో పాటు సబ్సిడీ పై విత్తనాలు, ఎరువులు, పంట నష్టం వాటిల్లినప్పుడు బీమా, ఇన్ పుట్ సబ్సిడీ, పంట ఉత్పత్తుల అమ్మకం లాంటి ప్రయో జనాలు పొందే వీలున్నందున రైతులు తప్పని సరిగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. సాగు చేస్తున్న పొలానికి చెందిన పాస్‌బుక్ జిరాక్స్, కౌలు చేసే రైతు ఆధార్ కార్డ్ జిరాక్స్, పాస్ పోర్ట్ ఫొటోలతో వి ఆర్ ఓ కు గానీ, రైతు భరోసా కేంద్రం లో గానీ దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వి ఆర్ ఓ సాంబశివరావు, రైతులు పుట్టి రామ చంద్ర రావు, పోతు గుంట్ల నరసయ్య, చంద్ర గణేష్, నూతలపాటి శ్రీనివాస్, తాడిబోయిన సాంబశివరావు తదితరులుపాల్గొన్నారు.



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎవో శ్రీ రంజని

ప్రజాశక్తి-తెనాలిరూరల్ :కౌలు రైతు కార్డుల అవగాహన కోసం రైతులతో వ్యవసాయ అధికారులు బుర్రిపాలెం, తేలప్రోలు గ్రామాల్లో సమావేశం నిర్వహిం చారు. ఈ సమావేశంలో కౌలు పండిస్తున్న రైతులు అధిక సంఖ్యలో పాల్గున్నారు. కౌలు తీసుకున్న రైతులు ప్రతి ఒక్కరూ స్థానిక విఆర్ఓ ల ద్వారా కౌలు రైతు కార్డులు పొందవచ్చని మండల వ్యవసాయ అధికారి జి ప్రేమ సాగర్ తెలిపారు. రైతు సేవా కేంద్రాల్లో విధులు నిర్వహిస్తున్న విఎఎ, విఆర్వోల కు పూర్తి చేసిన విజ్ఞాపన పత్రాలను సమర్పించాలని తెలియజేసారు. కార్యక్రమంలో తేలప్రోలు సర్పంచ్ షేక్ బాషా, పంచాయతీ సెక్రెటరీ ఉమాదేవి పాల్గొన్నారు.



పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన విద్యార్థులు

ప్రజాశక్తి - మంగళగిరి

గుడ్ షెఫర్డ్ స్వచ్ఛంద సేవా సంస్థ చైల్డ్ ప్రొటెక్షన్ ప్రాజెక్టు బాలల పార్లమెంట్ లీడర్స్ కార్యక్రమంలో భాగంగా గురువారం మంగళగిరిలోని పట్టణ పోలీస్ స్టేషన్ సందర్శనకు బాల బాలికలు తీసుకురావడం జరిగింది. పోలీస్ స్టేషన్ సందర్శన సందర్భంగా రైటర్ రాజు, పి ప్రవీణ్ పోలీస్ స్టేషన్లో ఎవరెవరు ఉంటారు, రిపోర్ట్ ఇవ్వటానికి ఎవర్ని కలవాలి తదితర అంశాలను విద్యార్థులకు వివరించారు. మెన్ లాకప్, ఉమెన్ లాకప్‌ల గురించి తెలియజేశారు. అనంతరం గుంటూరు జిల్లా కోర్ట్ సందర్శనకు తీసుకెళ్లారు. ఫ్రెండ్లీ కోర్టు అంటే ఏమిటి చైల్డ్ పెండ్లి కోర్టులో ఎలాంటి కేసులు తీర్పు జరుగుతాయో, ఫోక్సో యాక్ట్ తదితర అంశాల గురించి విద్యార్థి విద్యార్థులకు తెలియ జేశారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ ఇన్చార్జి సిస్టర్ వాణి మంగళగిరి మండల కమ్యూనిటీ ఫెసిలిటేటర్ నేలటూరి నాగమణి, బండ్లమూడి విజయలక్ష్మి, జొన్నకూటి ఇశ్రాయేల్, ఆతోట పోతురాజు, సిపి ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ పి అనూష తదితరులు పాల్గొన్నారు.

భూ అధీకృత చట్ట సవరణకు సంతకాలు సేకరణ

ప్రజాశక్తి- మేడికొండూరు

భూ అధీకృత చట్ట సవరణపై కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని గురువారం మండలంలోని డోకిపర్రు, మందపాడు గ్రామాలలో కౌలు రైతు సంఘం నాయకులు నిర్వహిం చారు. ఈ సందర్భంగా కౌలు రైతు సంఘం జిల్లా నాయకులు బొట్ల రామకృష్ణ మాట్లాడుతూ భూ అధీకృత చట్టంలో భూ యజమాని సంతకముతో పని లేకుండా ఉండే విధంగా చట్టాన్ని సవరించాలన్నారు. కౌలు రైతులు పలు రకాలుగా ఇబ్బందులు పడకుండా చూడా ల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. సేకరించిన సంతకాలను ముఖ్యమంత్రికి వినతి పత్రం పంపనట్లు తెలిపారు.



సంతకాలు సేకరిస్తున్న బొట్ల రామకృష్ణ తదితరులు

గుప్త డిగ్రీ కాళాశాలలో రోశయ్యకు ఘన నివాళి

ప్రజాశక్తి - తెనాలి

స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ఎన్ ఆర్ కె అండ్ కెఎస్ఆర్ గుప్తా డిగ్రీ కళాశాలలో గురువారం మాజీ ముఖ్యమంత్రి, తమిళనాడు మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్య 91వ జయంతి కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ గోగినేని విజయ్ కృష్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 1991లో పొట్టి శ్రీరాములు విద్యాసంస్థలలో ఎన్ ఆర్ కె అండ్ కెఎస్ఆర్ గుప్తా కళాశాల స్థాపనలో రోశయ్య పాత్ర అమూల్యమైనదన్నారు. అప్పటిలో కళాశాల గౌరవాధ్యక్షులుగా ఆయన ఉన్నారని గుర్తు చేశారు. అధ్యాపకులు ఎం దశరథరామిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రిగా 15 సార్లు అసెంబ్లీలో బడ్జెట్‌ను ప్రతిపాదించిన ఘనత రోశయ్యకే దక్కుతుందన్నారు. పొట్టి శ్రీరాములు విద్యాసంస్థల కోశాధికారి రావూరి సుబ్బారావు మాట్లాడుతూ ఈ ప్రాంత వాసి అయిన రోశయ్య ఆయన నిర్వహించిన పదవులకే వన్నెతెచ్చారని ప్రశంసించారు. కార్యక్రమంలో విద్యాసంస్థల మేనేజర్ డి శ్రీనివాసరావు, అవుతు శ్రీనివాసరెడ్డి, అధ్యాపకులు కె రవికుమార్, షేక్ రఫీ, ఆర్ వి సునీత, జి భారతిపాల్గొన్నారు.



ప్రజలపై అప్పుల భారం పడకూడదని ఆలోచించి ఆర్థికపరంగా సంస్కరణలు తీసుకొచ్చిన రోశయ్య చిరస్మరణీయులని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. ఈ సందర్భంగా తెనాలి బోసురోడ్డు కన్యకాపరమేశ్వరి ఆలయ ప్రాంగణంలో గురువారం నిర్వహించిన రోశయ్య జయంతి వేడుకల్లో పాల్గొన్నారు. తొలత రోశయ్య విగ్రహానికి ఆలపాటి నివాళులు అర్పించారు.



నిత్యావసరాలను పంపిణీ చేస్తున్న అంజలి రావూరి

గిరిజనులకు నిత్యావసరాలు పంపిణీ

ప్రజాశక్తి-తెనాలిరూరల్ :స్థానిక యడ్లలింగయ్య కాలనీలోని యానాది సామాజిక తరగతి నిరుపేదలకు ట్రైబల్స్ మినిస్ట్రీ అధ్యక్షులు అంజలి రావూరి గురువారం నిత్యావసరాలను పంపిణిచేశారు. బడికి వెళ్లాల్సిన గిరిజనుల పిల్లలను పాఠశాలలో చేర్పించి విద్యా బుద్ధులు నేర్పించాలని వారి తల్లిదండ్రులకు సూచించారు. బడికి పంపకుండా చిన్నారులను కూలి పనులకు పంపించడం నేరమన్నారు. యానాది సామాజవర్గానికి చెందిన కుటుంబాలు చెట్లక్రింద, ఊరికి చివరి నిరాశ్రయులుగా బ్రతికేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ పిల్లలు అభ్యున్నతికి చదువు ఒక్కటే ఆయుధమని ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో చేరిన 13 మంది గిరిజన బాలలకు ఆధార్ కార్డు మంజూరు కోసం అధికారులతో మాట్లాడి తగిన ఏర్పాట్లు చేస్తా మన్నారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి డాక్టర్ మేకల లక్ష్మీనారాయణ, ఇంటూరు విజయ భాస్కర్, దోనేపూడి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



యాత్రికులకు సౌకర్యాలు కల్పించండి

మహంకాళి అమ్మవారి దేవస్థానాన్ని సందర్శించిన మంత్రి నారా లోకేష్

ప్రజాశక్తి దుగ్గిరాల

మహంకాళీ అమ్మవారి దేశస్థానానికి అధిక సంఖ్యలో యాత్రికులు వస్తుంటారని, వారికి ఎటువంటి అసౌకర్యం కలుగకుండా చర్యలు చేపట్టాలని మంత్రి నారా లోకేష్ అధికారులను ఆదేశించారు. మండలంలోని కంఠంరాజు కొండూరు గ్రామ శివారులో ఉన్న శ్రీ మహంకాళి అమ్మవారి గుడిలో గురువారం ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యేగా గెలిచిన అనంతరం మండలానికి రావడం ఇదే మొదటిసారి కావటంతో ఆయన్ని చూసేందుకు పరిసర ప్రాంతాల నుండి అభిమానులు ప్రజలు అధిక సంఖ్యలో గుడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవస్థానంకి రావడానికి మెరుగైన రోడ్లు, వాహన పార్కింగ్, పరిశుభ్రత పరిసరాల అభివృద్ధి చేయడానికి ప్రణాళిక సిద్ధం చేయవలసిందిగా అధికారులను ఆదేశించారు. గుడి వద్దకు వచ్చిన ప్రజలతో కలిసి ఫోటోలు దిగిన అనంతరం స్థానిక నాయకులతో మాట్లాడారు. కార్యక్రమంలో రాష్ట్ర వాణిజ్య విభాగ కార్యదర్శి గూడూరు వెంకటరావు, నియోజకవర్గ సమన్వయకర్త నందం అబద్దయ్య, మండల టిడిపి అధ్యక్షులు కేశంనేని శ్రీ అనిత, మండల ఉపాధ్యక్షులు పసుపులేటి సాయి చైతన్య, షేక్ షబానా సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

పేదవిద్యార్థికి రూ.25 వేలు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - పెదనందిపాడు రూరల్

తిరుపతి పద్మావతి యూనివర్సిటీలో ఇంజినీరింగ్ తృతీయ సంవత్సరం చదువుతున్న పెదనందిపాడు విద్యార్థిని వేముల జ్యోతి మహాలక్ష్మిని రూ.25వేలు ఆర్థిక సాయం స్థానిక పారిశ్రామిక వేత్త దాసరి శేషగిరిరావు పెదనందిపాడులో గురువారం అందజేశారు. తన చదువుకు ఆర్థిక సాయం చేసిన వారికి జ్యోతి ఈసం దర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్ర మంలో దాసరి వాసు దేవ రావు, రాఘవ రావు పాల్గొన్నారు.



ఫార్మా.డి ఫలితాల్లో హిందూ ఫార్మసీ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-గుంటూరు



బి కృష్ణకుమారి నాగ స్నేహిత వెంకట శ్రీ లేఖ శ్రీవర్ధని

ఆచార్య నాగార్జున యూనివర్సిటీ విడుదల చేసిన నాలుగు మరియు ఐదవ సంవత్సరం ఫార్మా-డి. పరీక్షా ఫలితాల్లో హిందూ ఫార్మసీ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వి.నాగభూషణం తెలియచేశారు. ఫార్మా.డి నాలుగో సంవత్సరం పరీక్షలకు 29 మంది విద్యార్థులు హాజరుకాగా వారిలో 10 మంది డిస్టింక్షన్‌లోను, 16 మంది ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించినట్లు, ఐదవ సంవత్సరం పరీక్షలకు 24 మంది విద్యార్థులు హాజరుకాగా వారిలో 22 మంది డిస్టింక్షన్‌లోను, ఒకరు ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించినట్లు తెలియచేశారు. ఫార్మా.డి నాల్గవ సంవత్సరం విద్యార్థినులు గుంటూరు వెంకటశ్రీలేఖ 81.7శాతం మార్కులతో ప్రథమ స్థానం, బంధంరావూరి నాగస్నేహ 81.6శాతం మార్కులతో ద్వితీయ స్థానంతోను, ఫార్మా.డి.ఐదవ సంవత్సరం విద్యార్థినులు బలుసుపాటి కష్ణకుమారి 89.2శాతం మొదటి స్థానంలోను, సూరా శ్రీవర్ధిని 85.2శాతం ద్వితీయ స్థానంలో ఉత్తీర్ణత సాధించినట్లు తెలియచేశారు. ఈ సందర్భంగా ర్యాంకులు సాధించిన విద్యార్థులకు కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు, కార్యదర్శి డాక్టర్ ఎస్.మధుసూదనరావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ప్రత్యూష, ఫార్మా.డి డైరెక్టర్ డాక్టర్ పి.సీతారామయ్య, హెచ్.ఓ.డి. డాక్టర్ ఎన్.హేమకుమారి తదితరులు అభినందనలు తెలిపారు.

ఎన్‌ఎంఎంఎస్‌లో జలగం రామారావు స్కూల్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-గుంటూరు

ప్రతి సంవత్సరం డిసెంబర్ మొదటి వారంలో నిర్వహించే నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్స్ పరీక్షల్లో గుంటూరులోని జలగం రామారావు మెమో రియల్ హైస్కూల్‌లో 60 మంది విద్యార్థులు పాల్గొనగా గుంటూరు జిల్లాలో అత్యధికంగా 15 మంది విద్యార్థులు ఎంపికయ్యారని స్కూల్ ప్రధానోపాధ్యాయిని సుధారాణి తెలిపారు. ఈపరీక్షల్లో అర్హత సాధించిన విద్యార్థులకు మూడేళ్లపాటు పాటు ప్రతినెలా రూ.1000ల చొప్పన కేంద్ర ఫ్రభుత్వం ఇస్తుందన్నారు. గురువారం పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రుల సమక్షంలో స్కాలర్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థులపై ప్రత్యేక దష్టి సారించి వారిని తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయులను ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థులను నిరంతరం ప్రోత్సహిస్తూ, గైడెన్స్ ఇస్తూ తీర్చిదిద్దిన భౌతిక శాస్త్ర ఉపాధాయయులు బషీర్‌కు తల్లిదండ్రులు అభినందనలు తెలిపారు. కార్యక్రమం లో ఉపాధ్యాయులు మాదాసు హరీష్, ప్రసన్నలక్ష్మి, అనూష తదితరులు పాల్గొన్నారు.



ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం, ఇతర ఉపాధ్యాయులు

అల్లూరి సీతారామరాజుకు ఘన నివాళి



అల్లూరి విగ్రహానికి నివాళి అర్పిస్తున్న కలెక్టర్,ఎమ్మెల్యే గల్లా అరుణ, ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు తదితరులు

ప్రజాశక్తి-గుంటూరు : బ్రిటిష్ వారి అకృత్యాలకు వ్యతిరేకంగా, ఆదివాసీల హక్కుల కోసం పోరాడిన విప్లవ యోధుడు అల్లూరి సీతారామరాజు అని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మీ అన్నారు. గురువారం స్థానిక నాజ్ సెంటర్ వద్ద అల్లూరి సీతారామరాజు 127వ జయంతిని పురస్కరించు కొని జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మీ, ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, గుంటూరు తూర్పు , పశ్చిమ నియోజకవర్గాల ఎమ్మెల్యేలు మహమ్మద్ నసీర్, గల్లా మాధవి, జిఎంసి డిప్యూటీ మేయర్ సజీల అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం మీడియాతో కలెక్టర్ మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు గిరిజనుల హక్కుల కోసం, భారత స్వాతంత్ర్యం కోసం అనేక పోరాటాలు చేశారన్నారు. అప్పటి బ్రిటిష్ ప్రభుత్వం సంప్రదాయ అటవీ ఉత్పత్తులపై అటవీ ప్రాంత పొలాల సాగుపై కఠినమైన చట్టాలు తీసుకు రావడంతో ఆదివాసీల కష్టాలను గుర్తించిన అల్లూరి సీతా రామరాజు బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాటం చేసి ఆయన మన్యం వీరుడయ్యారన్నారు. అల్లూరి బ్రిటిష్ వారి దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పోరాడిన స్ఫూర్తిని, గిరిజనుల హక్కుల కొరకు చేసిన త్యాగాలను నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలని ఆమె కోరారు. ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణ రావు మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజుకు నిజమైన నివాళి అంటే గిరిజనుల అభివృద్ధికి కృషి చేయడమే అని, జాతీయ అటవీ హక్కుల చట్టాన్ని పూర్తిగా అమలు చేయాలన్నారు. గిరిజనుల పిల్లల కోసం ప్రత్యేకంగా స్టడీ సర్కిల్ ఏర్పాటుకు ప్రభుత్వానికి రిప్రజెంటేషన్ ఇవ్వడం జరిగిందని తెలిపారు. గల్లా మాధవి మాట్లాడుతూ అల్లూరి మహోన్నత వ్యక్తి అని, గిరిజనుల ఆశాజ్యోతి అని కొనియాడారు. నసీర్ మాట్లాడుతూ సీతారామరాజు ఆదివాసీల ఆణిముత్యమని, బ్రిటిష్ వారికి ఎదురొడ్డి నిలబడిన ధైర్యశాలి అన్నారు. కార్యక్రమంలో ఆర్డిఓ శ్రీఖర్, డిటిడబ్ల్యూఒ శిరీష తదితరులు పాల్గొన్నారు.

స్థానిక నాజ్ సెంటర్‌లోని అల్లూరి విగ్రహానికి పలు సంస్థలు నివాళులు అర్పించాయి. ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్, జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి, అవగాహన కార్యదర్శి కొండా శివరామిరెడ్డి తదితరులు అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ ఉపాధ్యక్షులు పి. రామచంద్రరాజు, అచ్యుత ఇందుశేఖర్, పి.యస్.మూర్తి, ఎం. భరత్, అవధానులహరి, టి.వి.సాయిరాం పాల్గొన్నారు.

ప్రజాశక్తి - ఎఎన్‌యు : ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ తాత్కాలిక రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సంధ్య కోలే, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య స్వరూపరాణి, సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య గంగాధరరావు, ఆర్కిటెక్చర్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య శ్రీనివాసరెడ్డి, తదితరులు అల్లూరి సీతారామరాజు విగ్రహానికి నివాళులర్పించారు.

ప్రజాశక్తి మంగళగిరి : మంగళగిరి తాడేపల్లి నగరపాల సంస్థ కార్యాలయంలో అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అడిషనల్ కమి షనర్ ఎన్ ప్రకాష్ రావు, ఎంపీడీవో రాఘవేంద్రనాథ్, ఎస్ ఎస్ వి కృష్ణారెడ్డి, పాల్గొన్నారు.

ప్రజాశక్తి -పెదనందిపాడు : పెదనంది పాడులోని తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రంలో అల్లూరి సీతారామారాజుకు ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో విజ్ఞాన కేంద్రం ట్రస్ట్ కన్వీనర్ దొప్పలపూడి రమేష్ బాబు, కొత్త వెంకటశివరావు, ముద్దన వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి -పొన్నూరు : పొన్నూరు వైసిపి కార్యాలయంలో నాయ కులు అంబటి మురళీ కృష్ణ తదితరులు సీతారామరాజు చిత్రప టానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. **ప్రజాశక్తి తెనాలి :** మన్యం వీరుడు అల్లూరి సీతారా మరాజు జయంతి కార్యక్రమం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించారు. సబ్ కలెక్టర్ ప్రఖర్ జైన్ అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి నివాళులర్పించారు. స్థానిక పురపాలక సంఘ కార్యాలయంలో అల్లూరి సీతారామరాజు జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ బి శేషన్న అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో చైర్ పర్సన్ తాడిపోయిన రాధిక ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో అసిస్టె ంట్ కమిష నర్ అనూష, ఏ సి పి ఎల్ సుబ్బారావు, వైస్ చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, పలువురు కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

బదిలీ కార్మికులను మస్టర్ కార్మికులుగా మార్చాలి

ప్రజాశక్తి-గుంటూరు



పి.పి.వావాకు సమస్యను వివరిస్తున్న ముత్యాలరావు

గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో బదిలీ పారిశుధ్య కార్మికులను రోజువారీ మస్టర్ కార్మికులుగా మార్చి, వారికి ప్రతి రోజు పని దక్కేలా చూడాలని, అలాగే పార్కులలో పని చేసే కార్మికులను కూడా 'క్లీన్ ఎన్విరాన్‌మెంట్' కార్మికులుగా గుర్తించి వారికి రూ. రూ.21వేలు జీతం ఇవ్వాలని ది గుంటూరు జిల్లా మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు అనుబంధం) జిల్లా ప్రధాన కార్యదర్శి బి.ముత్యాలరావు విజ్ఞప్తి చేశారు. గురువారం సఫాయి కర్మాచారి కమిషన్ సభ్యులు పి.పి.వావా గుంటూరు పర్యటన సందర్భంగా వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో జరిగిన సమావేశంలో బి.ముత్యాలరావు వావాకు వినతిపత్రం అందచేశారి, సమస్యను వివరించారు. ఈ సందర్భంగా ముత్యాలరావు మాట్లాడుతూ బదిలీ కార్మికులు గత 30 సంవత్సరాలుగా పని చేస్తున్నారని, కానీ ఏ రోజు పని ఉంటుందో, ఏరోజు ఉండదో తెలియదన్నారు. నెలకు 10 నుండి 15 రోజులు పని దొరకటమే గగమన్నారు. వచ్చే జీతంలో సగంపైన ఛార్జీలకే పోతుందన్నారు. వారు ఇప్పటికే ఆప్కాస్‌లో ఉన్నారని, వారిని కూడా రెగ్యులర్ మస్టర్ కార్మికులుగా మార్చి, ప్రతి రోజూ పని ఇవ్వాలని, వారి కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. అలాగే మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల అధీనంలోని పార్కులలో పనిచేస్తున్న కార్మికులు కూడా పారిశుధ్య కార్మికులవలె పార్కులలో చెత్త శుభ్రం చేయటం, మరుగుదొడ్లు శుభ్రం చేయటం, డివైడర్లపై చెత్తను తొలగించిటం చేస్తున్నారని, వారిని కూడా క్లీన్ ఎన్విరాన్‌మెంట్ వర్కర్లుగా గుర్తించి రూ.21వేలు జీతం ఇవ్వాలని కోరారు.

ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024

ఎంట్రీలకు ఆహ్వానం

ప్రియమైన మిత్రులారా!



ప్రజాశక్తి దిన పత్రిక వ్యవస్థాపక సంపాదకులు మోటూరు హనుమంతరావు స్మృత్యర్థం పాత్రికేయ రంగంలో ఉత్తమ కృషి చేసిన జర్నలిస్టులను సత్కరించేందుకు ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డును నెలకొల్పి రెండు దశాబ్దాలు దాటింది. కోవిడ్ కాలం మినహా ప్రతి యేటా క్రమం తప్పకుండా ఈ పురస్కారాన్ని ప్రజాశక్తి సాహితీ సంస్థ అందజేస్తూ వస్తున్నది. 2024 సంవత్సరానికి ఉత్తమ జర్నలిస్టు అవార్డు కోసం ఎంట్రీలను ఆహ్వానిస్తున్నది. సీనియర్ పాత్రికేయులు తెలకపల్లి రవి అధ్యక్షతన నాగార్జున యూనివర్సిటీ జర్నలిజం విభాగం అధిపతి ప్రొఫెసర్ జి అనిత, సీనియర్ జర్నలిస్టు నల్లి ధర్మారావుతో కూడిన త్రిసభ్య కమిటీ ఈ ఏడాది అవార్డు కోసం ఏదేని అంశంపై మానవాసక్తికర వార్తా కథనాలను ఎంట్రీలుగా ఆహ్వానించాలని నిర్ణయించింది. 2023 మే 1నుంచి 2024 జూన్ 18వ తేదీ వరకు తెలుగు దిన పత్రికల్లో ప్రచురితమైన మానవాసక్తికర కథనాలను మాత్రమే పంపాలి. ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన జర్నలిస్టులు ఎంట్రీలు పంపవచ్చు. ఎంట్రీతోపాటు ఇది నా సొంత రచన, ఎవరినీ అనుకరించినది కాదు అని స్వీయ ధ్రువీకరణ పత్రం జతచేసి పంపాలి. ఒక వ్యక్తి రెండు కథనాలకు మించి పంపకూడదు. తమ దృష్టికి వచ్చిన ఇతరుల కథనాలను ఎవరైనా సూచించవచ్చు కూడా. ప్రజాశక్తి సంస్థ జర్నలిస్టులు ఈ విభాగంలో పంపనవసరం లేదు. ఎంట్రీలు 2024 జులై 18 నాటికల్లా మాకు అందేట్లు చూడాలి. కవర్‌పై 'ఎం హెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024 కోసం' అని స్పష్టంగా పేర్కొనాలి. ఇ-మెయిల్ ద్వారా కూడా పంపవచ్చు. అవార్డు విజేతకు 2024 ఆగస్టులో జరిగే ఎంహెచ్ స్మారకోపన్యాస సభలో జ్ఞాపిక, రూ.10 వేలు నగదు ఇచ్చి సముచిత రీతిలో సత్కరించడం జరుగుతుంది.

ఎంట్రీలు పంపాల్సిన చిరునామా

ప్రజాశక్తి సాహితీ సంస్థ,
ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ,
తాడేపల్లి, గుంటూరు జిల్లా,
పిన్‌కోడ్-522501, ఇ మెయిల్
అడ్రస్: psmhaward@gmail.com

కార్యదర్శి

(ఎంవిఎస్ శర్మ)
ప్రజాశక్తి సాహితీ సంస్థ

జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తులు స్వీకరణ

ప్రజాశక్తి-గుంటూరు

జాతీయ స్థాయిలో ఉత్తమ ఉపా ధ్యాయ పురస్కారాలు-2024కు అర్హులైన ఉపాధ్యాయుల నుండి దర ఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా విద్యా శాఖ అధికారి పి.శైలజ ఒక ప్రకటనలో తెలిపారు. http// nationalawardstoteacher. education. gov.in వెబ్‌సైట్ ద్వారా నిర్దేశిం చిన మార్గదర్శకాలు అనుస రిస్తూ, జులై 15వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని డిఇఒ కోరారు.

పండుటాకు - గుండ్లకమ్మ తీరాన పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి-గుంటూరు

మధ్యతరగతి జీవితాలకు, రైతుల వెతలకు అద్దంపట్టే కథల రచయితగా మూడున్నర దశాబ్దాల కుపైగా సాహిత్య సేద్యం చేస్తున్న కాట్రగడ్డ దయానంద్ అభినంద నీయులని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ శివశంకర్ పేర్కొన్నారు. ఈశ్వర వరప్రసాద పరిషత్తు ఆధ్వర్యంలో గురువారం స్థానిక బృందావన గార్డెన్స్, వెంకటేశ్వరస్వామి దేవస్థానం అన్నమయ్య కళా వేదికపై వివిఐటి 30వ ప్రచురణగా కాట్రగడ్డ దయానంద్ కథా సంపుటి 'పండుటాకు-గుండ్లకమ్మ తీరాన' పుస్తక ఆవిష్కరణ సభ నిర్వహించారు. ప్రముఖ అనువాదకుడు కందిమళ్ల శివప్రసాద్ సభకు అధ్యక్షత వహించగా డాక్టర్ పాపినేని శివశంకర్ గ్రంథాన్ని ఆవిష్కరించి, ప్రథమ ప్రతిని విజయవాడ పోస్టుమాస్టర్ జనరల్ డి.ఎస్.వి.ఆర్ మూర్తికి అందజేశారు. ప్రముఖ రచయిత్రి వి.ప్రతిమ పుస్తక సమీక్ష చేశారు. వాసిరెడ్డి విద్యాసాగర్, వాసిరెడ్డి నవీన్, ఆలయ కమిటీ అధ్యక్షుడు చిటిపోతు మస్తానయ్య, కాట్రగడ్డ జయలక్ష్మి, చైతన్య, వసంత, కారుణ్య నిహారిక తదితరులు పాల్గొన్నారు.



పుస్తకావిష్కరణలో పాల్గొన్న పాపినేని శివశంకర్, తదితరులు